నేటి కందం- నేటికి అందం

రసవద్భక్తికి వసపడు
వ్యసనము గల యట్టి శ్రీనివాసుని కృపకై,
వసుమతిలో పుణ్యంబులు
ముసర-పవిత్రోత్సవాలు మొదలయ్యె మొగిన్ !!

(తిరుమలలో పవిత్రోత్సవాలు
వైభవంగా ప్రారంభం)



-రాధశ్రీ
సెల్:9494481210

# నేటినిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

కాళేశ్వరం బాధ్యులెవరో
కడకు తేల్చే కమిషన్
చర్యలుంటే దానిపైనా
సర్కారుకు ప్రమోషన్.
గత పాలక ఏలుబడిలో
గతితప్పిన నిర్మాణం
కుంగి కుములిపోతుంటే
కాగలదా బహుమానం

చురక



-వేల్పుల నారాయణ
9440433475

హైదరాబాద్ మంగళవారం 5-8-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93. Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-50 001. సంపుటి : 32 సంచిక : 2 పేజీలు:6 వెల: రూ.1/-


## జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి, శిబు సోరెన్ కన్నుమూత



జార్ఖండ్ ఆగష్టు 4 (ఎక్స్ ప్రెస్ న్యూస్);జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుత ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ తండ్రి శిబు సోరెన్ కన్నుమూశారు. ప్రస్తుతం ఆయన వయసు 81 ఏండ్లు. శిబు సోరెన్ గత కొంతకాలంగా కిడ్నీ సంబంధిత సమస్యలతో బాధపడుతున్న విషయం తెలిసిందే. ఈ ఏడాది జూన్‌లో అనారోగ్యంతో ఢిల్లీలోని గంగారాం ఆసుపత్రిలో చేరారు. అక్కడ చికిత్స పొందుతూ ఇవాళ ఉదయం తుదిశ్వాస విడిచారు. ఈ విషయాన్ని శిబు సోరెన్ కుమారుడు హేమంత్ సోరెన్ ఎక్స్ వేదికగా ప్రకటించారు.శిబు సోరెన్ మూడుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేశారు. అయితే, మూడుసార్లూ ఆయన ఐదేళ్ల పదవీకాలాన్ని పూర్తి చేయలేదు. మార్చి 2005లో ఆయన సీఎంగా తొలిసారి బాధ్యతలు చేపట్టారు. అయితే, తొమ్మిది రోజులు మాత్రమే ఆ పదవిలో కొనసాగారు. ఆ తర్వాత 2008 ఆగస్టులో మరోసారి సీఎంగా బాధ్యతలు చేపట్టారు. అప్పుడు కేవలం ఐదు నెలలు మాత్రమే అంటే 2009 జనవరి వరకూ ఆ కుర్చీలో కొనసాగారు. ఆ తర్వాత 2009 డిసెంబర్ నుంచి మే 2010 వరకూ మరోసారి సీఎంగా బాధ్యతలు చేపట్టారు. 2004 నుంచి 2006 వరకూ కేంద్ర మంత్రిగానూ వ్యవహరించారు. ఆరుసార్లు లోక్‌సభ ఎంపీగా, మూడు సార్లు రాజ్యసభకు కూడా ఎన్నికయ్యారు. శిబు సోరెన్ మరణ వార్త తెలుసుకున్న పలువురు నేతలు సంతాపం తెలుపుతున్నారు.

జీవితమే ఓ పోరాటం

జార్ఖండ్‌లోని సారవంతమైన గిరిజనుల భూములన్నీ బీహార్ మైదానప్రాంతం నుంచి వచ్చిన భూస్వాములు, వడ్డీ వ్యాపారులు ఆక్రమించి దోపిడీకి పాల్పడుతుండటంతో చిన్నతనంలోనే శిబు సోరెన్ తిరుగుబాటు చేశారు. 18 ఏండ్ల వయసులో సంతాల్ నవయువక్ సంఘ్ అనే సంస్థను స్థాపించారు. 1972లో బెంగాల్ కమ్యూనిస్టు నాయకులు ఏకే రాయ్, కుర్మి మహతో నాయకుడు బినోద్ బిహారీ మహతో కలిసి జార్ఖండ్ ముక్తి మోర్చా (ఏఓఓ) పార్టీని స్థాపించారు.గిరిజనుల హక్కుల కోసం ఎడతెగని పోరాటం చేశారు. ఈ క్రమంలో అనేక కేసులు కూడా ఎదుర్కొన్నారు. అయినా ఆయన లక్ష్యం సాధించేవరకు వెనుదిరగలేదు. స్వరాష్ట్రాన్ని సాధించి మూడుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేశారు. బీహార్ భూస్వాములు, దోపిడీదారులు, వలసవాదుల నుంచి గిరిపుత్రులకు సొంత రాష్ట్రాన్ని, స్వయం పాలనను సాధించిపెట్టిన నాయకుడు శిబు సోరెన్. మహామహా ఉద్దండ పిండాల్లాంటి రాజకీయ నాయకులు కూడా దిగొచ్చి జార్ఖండ్ రాష్ట్ర ఏర్పాటుకు స్వయంగా అంగీకరించేలా చేసిన గొప్ప చతురత కలిగిన నాయకుడు శిబు సోరెన్. అయినా ఆయన లక్ష్యం సాధించేవరకు వెనుదిరగలేదు. స్వరాష్ట్రాన్ని సాధించి మూడుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేశారు.

## అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గోల్ఫ్ రిసార్ట్ వద్ద భారీ భద్రతా వైఫల్యం

### -ట్రంప్ గోల్ఫ్ క్లబ్‌వైపు దూసుకొచ్చిన విమానం.. రంగంలోకి దిగిన ఫైటర్ జెట్స్

న్యూ డిల్లీ ఆగష్టు 4 (ఎక్స్ ప్రెస్ న్యూస్);అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గోల్ఫ్ రిసార్ట్ వద్ద భారీ భద్రతా వైఫల్యం బయటపడింది. భారీ భద్రతా వైఫల్యం.. ట్రంప్ గోల్ఫ్ క్లబ్‌వైపు దూసుకొచ్చిన విమానం.. రంగంలోకి దిగిన ఫైటర్ జెట్స్ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గోల్ఫ్ రిసార్ట్ వద్ద భారీ భద్రతా వైఫల్యం బయటపడింది. న్యూజెర్సీ లో గోల్ఫ్ క్లబ్ సమీపంలో నోఫ్లైజోన్ ప్రాంతంలోకి ఓ ప్రయాణికుల విమానం దూసుకొచ్చింది. వెంటనే అప్రమత్తమైన ఫైటర్ జెట్స్ రంగంలోకి దిగాయి.ఫాక్స్ న్యూస్ ప్రకారం.. ఆదివారం మధ్యాహ్నం 12:50 గంటల ప్రాంతంలో (స్థానిక కాలమానం ప్రకారం) ఈ ఘటన చోటు చేసుకుంది. బెడ్‌మినిస్టర్‌లోని ట్రంప్ గోల్ఫ్ సమీపంలో నోఫ్లైజోన్ ప్రాంతంలోకి ప్రయాణికుల విమానం ఒక్కసారిగా దూసుకొచ్చింది. విమానం రాకను గమనించిన ఫైటర్‌జెట్స్ వెంటనే రంగంలోకి దిగి ఆ విమానాన్ని అడ్డుకున్నాయి. ఓ రకమైన జ్వాలతో ప్రయాణికుల విమానం పైలట్‌ను అప్రమత్తం చేశాయి. దాన్ని నోఫ్లై జోన్ నుంచి పంపించేశాయి. ఆ సమయంలో అధ్యక్షుడు ట్రంప్ గోల్ఫ్ క్లబ్ రిసార్ట్‌లోనే ఉన్నారని నార్త్ అమెరికన్ ఏరోస్పేస్ డిఫెన్స్ కమాండ్ )ను ఊటంకిస్తూ ఫాక్స్ న్యూస్ నివేదించింది. ఈ ఘటనపై అధికారులు దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొంది.

## లైఫ్ సైన్సెస్ కేపిటల్‌గా హైదరాబాద్‌కు గుర్తింపు: సిఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ ఆగష్టు 4 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: లైఫ్ సైన్సెస్ కేపిటల్ గా హైదరాబాద్ కు గుర్తింపు లభించిందని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ లో ఫార్మా కంపెనీలకు జినోమ్ వ్యాలీ ప్రత్యేకమైనది అన్నారు.

అమెరికాకు చెందిన ఫార్మా కంపెనీని, గచ్చిబౌలిలో ప్రముఖ లిల్లీ ఫార్మా కంపెనీని సిఎం ప్రారంభం చేశారు. ఈ సందర్భంగా రేవంత్ మీడియాతో మాట్లాడుతూ..2047 నాటికి 3 ట్రిలియన్ల ఎకానమీగా తెలంగాణ ఉంటుందని తెలియజేశారు.

దేశ ఆర్థిక వ్యవస్థలో 10 శాతం తెలంగాణ నుంచే అందిస్తామని, హైదరాబాద్ నుంచే 40 శాతం ఫార్మా ఉత్పత్తులు, అత్యధిక వ్యాక్సిన్లు తయారవుతున్నాయని అన్నారు. పరిశ్రమలకు తమ ప్రభుత్వం



అండగా ఉంటుందని, అభివృద్ధి, ఆవిష్కరణలకు అనువైన వాతావరణం కల్పిస్తామని చెప్పారు. హైదరాబాద్ ను భవిష్యత్ గ్లోబల్ హెల్త్ కేర్ హబ్ గా మారుస్తామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

## తెలంగాణలోని పలుచోట్ల ఈ నెల 8 వరకు మోస్తరు నుంచి భారీ వర్షాలు

### - హెచ్చరించిన హైదరాబాద్ వాతావరణ కేంద్రం

హైదే్రాబాద్ ఆగష్టు 4 (ఎక్స్ ప్రెస్ న్యూ స్)తెలంగాణలోని పలుచోట్ల ఈ నెల 8 వరకు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. ఉపరితల ఆవర్తనం నైరుతి బంగాళాఖాతం, ఉత్తర తమిళనాడు తీరం వెంట సముద్రమట్టానికి 3.1 నుంచి 5.8 కిలోమీటర్ల వరకు విస్తరించి ఉందని.. తూర్పు-పశ్చిమ ద్రోణి తూర్పు మధ్య అరేబియా సముద్రం దక్షిణ భాగాల నుంచి దక్షిణ ఇంటీరియర్ కర్నాటక, తమిళనాడు మీదుగా మధ్య బంగాళాఖాతం తీర ప్రాంతంలోని ఉపరితల ఆవర్తనం వరకు కొనసాగుతుందని.. సగటున 5.8 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉందని.. ఎత్తుకు వెళ్లే కొద్దీ దక్షిణం వైపు వంగి ఉందని పేర్కొంది.సోమవారం జయశంకర్ భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని పేర్కొంది. మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల మోస్తరు వర్షాపాతం నమోదయ్యే అవకాశాలున్నాయని చెప్పింది. బుధవారం నాగర్ కర్నూల్, జోగులాంబ గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని తెలిపింది. గురువారం మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో.. శుక్రవారం నల్గొండ, నాగర్ కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది.

## ఇల్లెందులో 45 కిలోల గంజాయి పట్టివేత



ఖమ్మం, ఆగష్టు 4: అక్రమంగా గంజాయిని తరలిస్తున్న ముగ్గురిని ఇల్లెందు పోలీసులు పట్టుకున్నారు. వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో కొత్తగూడెం వైపు నుంచి ఇల్లెందు వెళ్తున్న మారుతి యూవీ 300 కారులో వారు గంజాయి తరలిస్తున్నట్లు గుర్తించారు. దీంతో వారిని అరెస్టు చేసి, కారు, మూడు సెల్‌ఫోన్లను సీజ్ చేశారు.నిందితులను మహబూబాబాద్ జిల్లా మరిపెడకు చెందిన తేజావత్ శంకర్, తేజావత్ జంకు, సూర్యాపేట జిల్లాకు చెందని ఆంగోతు సంతులుగా పోలీసులు గుర్తించారు. ఒడిశాకు చెందిన రాము తాతారావు వద్ద గంజాయిని తీసుకుని మహారాష్టలోని హరిబాబుకు అప్పగించేందుకు వెళ్తున్నట్లుగా విచారణలో తెలుసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ రూ. 22.68 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు.

## విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఏర్పరుచుకోవాలి

### - కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

నల్గొండ, ఆగష్టు4:విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకుని, సాధించే దిశగా కృషి చేయాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. సోమవారం పెన్‌పహాడ్ జడ్పీహెచ్ఎస్, కేజీబీవీ, తాసీల్దార్ కార్యాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ తెలుగు మీడియం పదో తరగతి బయో సైన్స్ క్లాస్‌ని విద్యార్థులతో కలిసి విన్నారు. అలాగే ఇంగ్లిష్ మీడియంలో పదో తరగతి విద్యార్థులను ఇంగ్లిష్ సబ్జెక్టు పై పలు ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. తదుపరి ఉపాధ్యాయులతో సమావేశమై బోధనాభ్యసనాల తీరుపై సమీక్షించారు. అనంతరం కేజీబీవీని సందర్శించి, విద్యా బోధన, భోజనం సౌకర్యం, ఇతర సమస్యలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వంటగదిలోని కూరగాయలు, ఆయిల్, పప్పును పరిశీలించారు. తాజా కూరగాయలతో పాటు నాణ్యమైన సరుకులను మాత్రమే వంటకి ఉపయోగించాలని నిర్వాహకులకు సూచించారు.

తదుపరి తాసీల్దార్ కార్యాలయంలో భూ భారతి అర్జీలపై అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. అధికారుల బృందాలు గ్రామాల వారీగా క్షేత్రస్థాయిలో పరిశీలించి భూ సమస్యలను వేగంగా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా తాసీల్దార్ లాలూ నాయక్ స్పందిస్తూ.. భూ భారతి రెవెన్యూ సదస్సుల ద్వారా 2,953 అర్జీలు వచ్చాయని, 925 అర్జీలకి నోటీసులు జారీ చేయటం జరిగిందని, 10 అర్జీలను పరిష్కరించటం జరిగిందని, మిగిలినవి వివిధ దశల్లో పురోగతిలో ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఎంఈఓ రవికుమార్, ఆర్ ఐ రంజిత్ రెడ్డి, కేజీబీవీ ఎస్ఓ ఆసియా జబ్బీన్, పీఈటీ జానకమ్మ, ఉపాధ్యాయులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## హైదరాబాద్ అంతర్జాతీయ ఫార్మా కంపెనీలకు గమ్యస్థానం: శ్రీధర్ బాబు

హైదరాబాద్ ఆగష్టు 4 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: అమెరికాకు చెందిన లిల్లీ ఫార్మా కంపెనీని, గచ్చిబౌలిలో ప్రముఖ ఫార్మా కంపెనీని సిఎం రేవంత్ రెడ్డి ప్రారంభోత్సవం చేశారు. ఈ ప్రారంభోత్సవంలో సిఎం, మంత్రి శ్రీధర్ బాబు పాల్గొన్నారు.వవ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులకు అనువైన వాతావరణం ఉందని తెలంగాణ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. రాష్ట్రంలో వివిధ రాష్ట్రాలు, దేశాలకు చెందిన ప్రజలు ఉన్నారని అన్నారు. ఈ సందర్భంగా శ్రీధర్ బాబు మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ 2047 లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని, రాష్ట్రంలో ఫార్మా కంపెనీలకే ప్రత్యేకమైన జినోమ్ వ్యాలీ ఉందని తెలియజేశారు. మెడ్ టెక్నాలజీకి రాష్ట్రం ప్రత్యేకమైన హబ్ గా ఎదుగుతోందని, అంతర్జాతీయ ఫార్మా కంపెనీలకు హైదరాబాద్ గమ్యస్థానంగా ఉందని ప్రశంసించారు. హైదరాబాద్ లో అత్యాధునికమైన కమాండ్ కంట్రోల్ సెంటర్ ఉందని, ఎఐ టెక్నాలజీ రీసెర్చ్ సెంటర్ నిర్మాణానికి కూడా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వచ్చిందని అన్నారు. హైదరాబాద్ లో ఇప్పటికే చాలా అంతర్జాతీయ సంస్థలు ఉన్నాయని, ఇప్పుడు మరికొన్ని అంతర్జాతీయ సంస్థలు జతకలవడం సంతోషకరంగా ఉందని కొనియాడారు. పరిశ్రమలకు, పెట్టుబడులకు స్నేహపూర్వక వాతావరణం కల్పించామని పేర్కొన్నారు. గత 19 నెలల్లో తెలంగాణ రూ. 3.2 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించిందని, కొత్త పెట్టుబడుల సాధనలో గుజరాత్, తమిళనాడు తర్వాత తెలంగాణ నిలిచిందని ఆనందాన్ని వ్యక్తం చేశారు. జినోమ్ వ్యాలీ, మెడ్ టెక్ పార్కును మరింత విస్తరించే ప్రణాళికలతో ఉన్నామని శ్రీధర్ బాబు స్పష్టం చేశారు.

## విద్యారంగ సమస్యలను విస్మరించిన ప్రభుత్వం : యూటీఎఫ్

ఖమ్మం, ఆగష్టు 4:విద్యారంగ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం విస్మరిస్తుదని యూటీఎఎఫ్ జిల్లా కార్యదర్శి, టీపీటీఎఫ్ రాష్ట్ర నేత పద్మ, టీజీటీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బన్సీలాల్ అన్నారు. సోమవారం కారేపల్లి మండలం కోవట్లగూడెం హైస్కూల్‌లో యూఎస్పీసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమస్యలపై చర్చల పేరుతో తాత్సారం చేయడం తప్పా ప్రభుత్వం పరిష్కారం చూపడం లేదన్నారు. అన్ని క్యాడర్ల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ ని తక్షణవే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జీహెచ్ఎం, ఎస్ఏ, పీఎస్ హెచ్ఎం ఖాళీలను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలన్నారు. జీఓ నంబర్ 25ను సవరించటం ద్వారా ప్రతి పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని రకాల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె కాలపు జీతాన్ని వెంటనే చెల్లించాలని, కేజీబీవీ, యూఆర్ఎస్, సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులకు బేసిక్ పే అమలు చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా ప్రతి ఏడాది వేసవిలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు నిర్వహించాలన్నారు. విద్యారంగంలో ఎన్జీవోల జోక్యాన్ని నివారించాలన్నారు. విద్యారంగ సమస్యలపై ఈ నెల 5వ తేదీన జరుగు ధర్నాను జయప్రదం చేయాలని వారు కోరారు. అనంతరం విద్యారంగ సమస్యలపై కరపత్రాన్ని నాయకులు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో యూఎస్పీసీ నాయకులు, కేవీ కృష్ణా రావు, బి.మంగీలాల్, ఎం.హరీశ్, బి.శ్రీనివాసరావు, ఏ.బన్సీలాల్, ఈరు నాయక్, మంద రాములు, శారద, ప్రేమ్ సాగర్, జ్యోతి పాల్గొన్నారు.






## శిబూ సోరెన్ మృతిపట్ల కేసీఆర్ సంతాపం..

హైదరాబాద్, ఆగష్టు 4:జార్ఖండ్ ముక్తి మోర్చా అధినేత, జార్ఖండ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి శిబూ సోరెన్ మృతి పట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంతాపం వ్యక్తంచేశారు. ఆయన మరణం జార్ఖండ్, తెలంగాణ వంటి దేశ ప్రాంతీయ అస్తిత్వ రాజకీయాలకు, జాతీయ ఫెడరల్ స్ఫూర్తికి, ఆదివాసీ సమాజానికి తీరని లోటని అన్నారు. ఈ సందర్భంగా శిబూ సోరెన్‌తో తనకున్న వ్యక్తిగత అనుబంధాన్ని, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమానికి వారందించిన సహకారాన్ని స్మరించుకున్నారు. దేశ ఫెడరల్ స్ఫూర్తిని ప్రతిఫలించే దిశగా, శిబూ సోరెన్ చేపట్టిన జార్ఖండ్ స్వరాష్ట్ర ఏర్పాటు ఉద్యమం, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి స్ఫూర్తి నింపిందన్నారు.

2001లో తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) స్థాపన సమయంలో శిబూ సోరెన్‌ని హైదరాబాద్‌లో జరిగిన తొలి సభకు మొదటి అతిథిగా ఆహ్వానించుకున్నామని గుర్తు చేశారు. నాటి తెలంగాణ ఉద్యమానికి ఆయన తెలిపిన సంపూర్ణ సంఘీభావం మర్చిపోలేనిదని చెప్పారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను గుర్తించిన శిబూ సోరెన్, తాను ప్రారంభించిన తెలంగాణ మలిదశ ఉద్యమానికి అండగా నిలిచారని కేసీఆర్ తన కృతజ్ఞతా భావాన్ని వ్యక్తం చేశారు.

2014లో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సమయంలో కూడా శిబూ సోరెన్ మద్దతుగా నిలిచారని, జార్ఖండ్, తెలంగాణ ప్రజల ఉద్యమ విజయాలు దేశ ఫెడరల్ స్ఫూర్తికి, ప్రాంతీయ, సామాజిక న్యాయానికి దిక్సూచిగా నిలిచాయని కేసీఆర్ తెలిపారు. శిబూ సోరెన్ నేతృత్వంలోని జేఎంఎం పార్టీ తెలంగాణ ఉద్యమ సమయంలో కేంద్రంలో ఉన్న యూపీఏ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉండడంతో రాష్ట్ర ఏర్పాటు కోసం ఒత్తిడి తేవడంలో కీలక పాత్ర పోషించిందని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతర కాలంలో 2022లో జార్ఖండ్‌లో శిబూ సోరెన్‌ని కలిసి వారి ఆశీస్సులు తీసుకున్న విషయాన్ని కేసీఆర్ గుర్తు చేసుకున్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. తండ్రిని కోల్పోయి దుఃఖ సంద్రంలో మునిగిన వారి కుమారుడు జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్‌కు, వారి కుటుంబ సభ్యులకు కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## హేమంత్ సోరెన్‌ను ఓదార్చిన ప్రధాని మోదీ.





న్యూఢిల్లీ,ఆగష్టు 4:జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ ఇంట తీవ్ర విషాదం నెలకొంది. ఆయన తండ్రి, జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి శిబు సోరెన్ ఇవాళ ఉదయం కన్నుమూసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు హేమంత్ సోరెన్‌కు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సైతం హేమంత్ సోరెన్‌ను ఓదార్చారు.

శిబు సోరెన్ మరణవార్త తెలుసుకున్న ప్రధాని ఇవాళ ఉదయం ఢిల్లీలోని గంగారాం ఆస్పత్రికి వెళ్లారు. అక్కడ ముందుగా శిబు సోరెన్ భౌతికకాయానికి నివాళులర్పించారు. అనంతరం సోరెన్ కుటుంబాన్ని పరామర్శించారు. తండ్రిని కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న జార్ఖండ్ సీఎంను దగ్గరకు తీసుకుని ఓదార్చారు.

శిబు సోరెన్ (81) గత కొంతకాలంగా కిడ్నీ సంబంధిత సమస్యలతో బాధపడుతున్న విషయం తెలిసిందే. ఈ ఏడాది జూన్‌లో అనారోగ్యంతో ఢిల్లీలోని గంగారాం ఆసుపత్రిలో చేరారు. అక్కడ చికిత్స పొందుతూ ఇవాళ ఉదయం తుదిశ్వాస విడిచారు. ఈ విషయాన్ని శిబు సోరెన్ కుమారుడు హేమంత్ సోరెన్ ఎక్స్ వేదికగా ప్రకటించారు.

# చందమామపై తొలి అడుగు వేసిన ఘనుడు నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్

## (05 ఆగష్టు "వ్యోమగామి నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ జన్మదినం" సందర్భంగా)

చంద్రమండలంపై కాలువోపిన మొదటి వ్యోమగామి(ఆస్ట్రనాట్)గా నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ అంతరిక్ష చరిత్రలో చెరగని అరుదైన రికార్డును నెలకొల్పాడు. 05 ఆగష్టు 1930న ఓహియా నగరంలో జన్మించిన నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ పర్డ్యూ యూనివర్సిటీలో ఏరోనాటికల్ ఇంజనీరింగ్ డిగ్రీని పూర్తి చేసి, సదరన్ కాలిఫోర్నియా యూనివర్సిటీలో ఇంజనీకరింగ్ విభాగంలో పిజీ కూడా పూర్తి చేసారు. 1949 – 50 మధ్య కాలంలో నానల్ ఏవియేటర్‌గా, నేషనల్ అడ్వైజరీ కమిటీ ఫర్ ఏరోనాటిక్స్, నాసా(నేషనల్ ఏరోనాటిక్స్ అండ్ స్పేస్ ఆర్గనైజేషన్)లలో చేరిన నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్17 ఏండ్ల పాటు ఇంజనీర్‌గా సేవలు అందించారు. నాసాలో ప్రాజెక్ట్ పైలెట్‌గా దాదాపు 200 రకాల ఏయిర్‌క్రాఫ్ట్‌లు, జెట్స్, రాకెట్లు, హెలీకాప్టర్లు, గ్లైడర్స్‌ల్లో వైమానికుడిగా బహుముఖీన ప్రతిభను ప్రదర్శించారు. 1962లో ఆస్ట్రోనాట్‌గా "జెమిని-8 మిషన్"లో భాగంగా 1966లో అంతరిక్షయానం విజయవంతంగా పూర్తి చేశారు. అంతరిక్షంలో నెలకొన్న తీవ్ర వాతారణాన్ని తట్టుకుంటూ మానసికంగా దృఢ విశ్వాసంతో చంద్రమండల ప్రయాణం పూర్తి చేసిన ఆర్మ్‌స్ట్రాంగ్ చూపిన సాహస స్ఫూర్తి నేటి తరానికి ప్రేరణగా నిలుస్తున్నది.

బహుముఖ ప్రజ్ఞాశాలి నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ :

నానల్ ఏవియేటర్, టెస్ట్ పైలెట్, యూనివర్సిటీ ప్రొఫెసర్, ఏరోనాటికల్ ఇంజనీర్ లాంటి పలు బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించిన నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ "అపోలో-11 ల్యూనార్ మాడ్యూల్" ప్రాజెక్ట్‌లో స్పేస్‌క్రాఫ్ట్ కమాండర్‌గా తొలి మానవసహిత చంద్రమండల ప్రయాణానికి నాయకుడిగా సిద్ధం అయ్యారు. 16 జూలై 1969 రోజున నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్‌తో పాటు పైలెట్ బజ్ ఆల్డ్రిన్, మైఖేల్ కోలిన్స్‌లతో కలిసి చంద్రమండల ప్రయాణానికి ప్రారంభం అయ్యారు. 2.4 లక్షల మైళ్లు ప్రయాణించి 20 జూలై 1969న చంద్రమండలానికి చేరుకున్నారు. అదే రోజు నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ వ్యోమనౌక లోంచా బయటకు వచ్చి చందమామ ఉపరితలంపై తొలిసారి కాలుమోపి, రెండున్నర గంటల పాటు చంద్రుడిపై బజ్ ఆల్డ్రిన్‌తో కలిసి సంచరించాడు. వ్యోమనౌకలో ఉన్న మైఖేల్ కాలిన్స్ కక్షలో మాత్రమే పరిభ్రమించాడు. అంతరిక్ష చరిత్రలో మొదటి మానవుడిగా రికార్డును నెలకొల్పారు. ఈ అంతరిక్ష మిషన్‌లో మొత్తంగా 8 రోజులు, 14 గంటలు, 12 నిమిషాలు అంతరిక్షంలో గడిపారు. చందమామ ఉపరితలంపై కాలుమోపిన మరు క్షణమే భావోద్వేగాలకు గురి అయిన ఆర్మ్‌స్ట్రాంగ్ మాట్లాడుతూ "చందమామ పై వేసిన ఓ చిన్న తొలి అడుగు, రేపటి మానవాళి అంతరిక్ష చరిత్రలో ఓ భారీ ముందడుగు" అంటూ పేర్కొన్నారు.

అంతరిక్ష రంగంలో చెరగని ముద్ర:

16వ ఏట 1947లో నావల్ ఏయిర్ కెడెట్‌గా, 1971 – 79 మధ్య కాలంలో సిన్సినాటీ యూనివర్సిటీలో ఏరోస్పేస్ ఇంజనీరింగ్ విభాగంలో ఆచార్యుడిగా, 1982 – 92 మధ్య కంప్యూటింగ్ టెక్నాలజీ ఫర్ ఏవియోషన్ విభాగానికి చైర్మన్‌గా ఆర్మ్‌స్ట్రాంగ్ సేవలు అందించారు. పలు ఏవియోషన్ సంఘాల్లో సభ్యుడిగా లేదా చైర్మన్‌గా పలు హోదాల్లో పని చేశారు. తన జీవితకాలంలో 17కు పైగా యూనివర్సిటీల నుంచి గౌరవ డాక్టరేట్లు పొంది పలు పురస్కారాలు స్వీకరించారు. ప్రెసిటెంట్స్ మెడల్, ఏవియేషన్ పురస్కారాలు, రాబర్ట్ ట్రోఫీలను అందుకున్నారు. 25 ఆగష్టు 2012న తన 82వ ఏట అనారోగ్యంతో తుది శ్వాస విడిచిన నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ ఆదర్శమయ జీవితం ఏరోనాటికల్ ఇంజనీర్స్, వ్యోమగాములకు దారి దీపంగా వెలుగులు చిమ్ముతూనే ఉన్నారు.

అద్భుత ధైర్యానికి మారుపేరుగా నిలిచిన నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ జీవితం ఆసాంతం అంతరిక్ష శాస్త్రానికే అంకితం, నేటి ఆస్ట్రోనాట్స్‌కే ఆదర్శప్రాయం.

-డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేసిన కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి శ్రీ నితిన్ గడ్కరీ...

న్యూఢిల్లీ,ఆగష్టు 4:272 కిలోమీటర్ల మేర విస్తరించిన 29 జాతీయ రహదారి ప్రాజెక్టులకు కేంద్ర రోడ్డు రవాణా, రహదార్ల శాఖ మంత్రి శ్రీ నితిన్ గడ్కరీ ఆంధ్రప్రదేశ్‌లోని మంగళగిరిలో శంకుస్థాపన చేసి, ప్రారంభించారు.

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఉపముఖ్యమంత్రి శ్రీ పవన్ కల్యాణ్, కేంద్ర మంత్రులు శ్రీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, శ్రీ భూపతిరాజు శ్రీనివాస వర్మ, డాక్టర్ చంద్రశేఖర్ పెమ్మసాని, ఎంపీలు, ఎమ్మెల్యేలు, సీనియర్ అధికారులు పాల్గొన్నారు. ఈ ప్రాజెక్టులపై రూ.5,233 కోట్లకుపైగా ఖర్చు చేయనున్నారు.

సభను ఉద్దేశించి శ్రీ గడ్కరీ మాట్లాడుతూ, "ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనికతకు అనుగుణంగా.... ప్రమాదభరిత ప్రాంతాలు, రైల్వే క్రాసింగ్‌లను తొలగించేందుకు, రవాణా ఖర్చులను తగ్గించేందుకు, గ్రామీణ-గిరిజన ప్రాంతాలలో తుది దశలోని అనుసంధానతను బలపర్చేందుకు, తిరుపతి, నెల్లూరు, రాయచోటి వంటి ప్రధాన పట్టణ కేంద్రాల్లో ట్రాఫిక్‌ను తగ్గించేందుకు ఈ ప్రాజెక్టులకు రూపకల్పన చేసినట్లు చెప్పారు.

వీటి ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను భారత అభివృద్ధి గాథలో ముందుండే రాష్ట్రంగా తీర్చిదిద్దే దిశగా ప్రయత్నిస్తున్నామని పేర్కొన్నారు.

దేశంలో లాజిస్టిక్స్ ఖర్చు గణనీయంగా తగ్గిన విషయాన్ని శ్రీ గడ్కరీ తన ప్రసంగంలో ప్రత్యేకంగా ప్రస్తావించారు.

మెరుగైన రహదారి మౌలిక సదుపాయాల వల్ల లాజిస్టిక్స్ ఖర్చు 16 శాతం నుంచి 10 శాతానికి తగ్గిందని, 2025 డిసెంబర్ నాటికి ఇది 9 శాతానికి దిగివచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఈ తగ్గుదల ఎగుమతులను రెట్టింపు చేయడానికి, ఉద్యోగావకాశాలను పెంచడానికీ దోహదపడుతుందని అన్నారు. అదేవిధంగా, నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా పరిధిలో జాతీయ రహదారుల పొడవు 2014లో 4,000 కిలోమీటర్ల నుంచి 2025లో 8,700 కిలోమీటర్లకు అంటే 120% మేర పెరిగిందని తెలిపారు. ఇది మౌలిక ఆధారిత ఆర్థిక అభివృద్ధిపై ప్రభుత్వం చేసిన గట్టి కృషికి నిదర్శనమని పేర్కొన్నారు.

ఎన్‌హెచ్71లోని మదనపల్లె నుంచి పీలేరు వరకు 56 కిలోమీటర్ల పొడవున్న మార్గాన్ని 4 లైన్ల కారిడార్‌గా నవీకరించారు.

ఈ ప్రాజెక్టుపై రూ.1,994 కోట్లు వెచ్చించారు.

ఇందులో 9 ఫ్లైఓవర్లు, ఒక రైలు ఓవర్‌బ్రిడ్జ్, 19 ప్రధాన వంతెనలు, 5 వాహన అండర్ పాస్‌లు, 10 స్థానిక అండర్‌పాస్‌లు ఉన్నాయి.

అదే విధంగా, కర్నూలు నుంచి మండ్లెం వరకు 31 కిలోమీటర్ల పొడవైన ఎన్‌హెచ్-340సీ రోడ్డును పేవ్డ్ షోల్డర్లు కలిగిన నాలుగు లైన్ల మార్గంగా అభివృద్ధి చేశారు. దీన్ని రూ.858 కోట్ల వ్యయంతో చేపట్టారు. ఇందులో ఒక ఫ్లైఓవర్, 4 వయడక్ట్స్, 3 స్థానిక అండర్‌పాస్‌లు, ఒక చిన్న అండర్‌పాస్ ఉన్నాయి.

ఈ అభివృద్ధి ప్రాజెక్టులతో పాటు, రాష్ట్రవ్యాప్తంగా కనెక్టివిటీని మెరుగుపరచేందుకు మరో 27 ప్రాజెక్టులకు శంకుస్థాపనలు జరుగుతున్నాయి.

ఇవి తిరుపతి, శ్రీశైలం, కదిరి వంటి పుణ్యక్షేత్రాలకు, హార్స్ లీ హిల్స్, ఓడరేవు బీచ్ వంటి పర్యాటక కేంద్రాలకు చేరువ చేస్తాయి. శ్రీ సిటీ, కృష్ణపట్నం పోర్ట్, తిరుపతి విమానాశ్రయం వంటి ఆర్థిక కేంద్రాలకు మరింత కనెక్టివిటీను అందించనున్నాయి.

# స్వదేశీ ఉత్పత్తులనే ఉపయోగించండి అంటూ పౌరులకు ప్రధాని ఇచ్చిన పిలుపును పునరుద్ఘాటించిన కేంద్ర వ్యవసాయ మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్

న్యూఢిల్లీ,ఆగష్టు 4:మన దేశంలో తయారు చేసిన ఉత్పత్తులను కొనండంటూ పౌరులకు ప్రధానమంత్రి చేసిన విజ్ఞప్తిని కేంద్ర వ్యవసాయ, రైతుల సంక్షేమ శాఖ మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ ఈ రోజు పునరుద్ఘాటించారు. పీఎం-కిసాన్ సమ్మాన్ నిధి 20వ వాయిదాను ఈ నెల 2న వారణాసిలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ పంపిణీ చేసిన సందర్భంగా, స్వదేశీ ఉత్పత్తులనే కొనండంటూ దేశ ప్రజలను కోరారు. ఆర్థికవ్యవస్థను పటిష్ఠపరచడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర వ్యవసాయ మంత్రి మరోసారి స్పష్టంచేస్తూ, ప్రధాని విజ్ఞప్తిని పునరుద్ఘాటించారు. ఒక అధికార ప్రకటనలో మంత్రి ఈ కింది 'ప్రియమైన సోదర, సోదరీమణులు, మేనకోడళ్లు, మేనల్లుళ్లారా.. ప్రతిఒక్కరూ..కీటకాలు, పశు పక్ష్యాదులతో సహా.. తమ కోసం తాము జీవిస్తాయి. అయితే, తన కోసమే తాను బతకడంలో గొప్పేముంది? మనం మన దేశం కోసం జీవించి తీరాలి. దేశం కోసం జీవించడం ఎంత ముఖ్యమో నిన్న మనకు గౌరవ ప్రధాని బోధించారు. మన ఇళ్లలో వాడడానికి మన దేశంలోనే తయారు చేసిన ఉత్పత్తులను మాత్రమే వాడదామంటూ మనకు ఆయన విజ్ఞప్తి చేశారు.

ప్రియమైన సోదర, సోదరీమణులారా, ఏ వస్తువైనా మీ గ్రామంలో, మీకు దగ్గరలో ఉన్న నగరంలో, మీ జిల్లాలో, మీ రాష్ట్రంలో, లేదా మన దేశంలో మరెక్కడైనా సరే, తయారైందంటే.. అలాంటి వాటినే కొనండి. భారతదేశ ఆర్థిక వ్యవస్థ శరవేగంగా వృద్ధి చెందుతోంది. మనం ఇప్పుడు ప్రపంచంలో నాలుగో స్థానంలో నిలిచాం.. అతి త్వరలోనే, మూడో స్థానానికి దూసుకుపోతాం. 144 కోట్ల మంది జనాభా ఉన్న ఈ దేశం ఒక సువిశాల మార్కెట్. మనం మన దేశంలో తయారైన వస్తువులనే కొని, ఉపయోగిస్తామని సంకల్పించుకొంటే, అప్పుడు మన రైతులు, మన చిన్న తరహా ఉత్పత్తిదారు సంస్థలు, స్వయంసహాయక బృందాలతో పాటు చేతివృత్తి కళాకారులు.. ఇలా ప్రతి ఒక్కరికీ వారి ఆదాయం పెరుగుతుంది. మరి వారి సంపాదన పెరిగితే, మన ఆర్థిక వ్యవస్థ కూడా బలపడుతుంది.

మన డబ్బు విదేశాలకు ఎందుకు దక్కడం? ఆ డబ్బుతో మన పిల్లలకు బతుకుదెరువును అందిద్దాం. నేను నా దేశం కోసం బతుకుతాను, మీరు కూడా దేశం కోసం బతకాలి.. భారత్‌లో తయారు చేసిన వస్తూత్పత్తులను మాత్రమే కొనండి. మీకు ధన్యవాదాలు."

# నాణ్యమైన విద్యే.. ప్రభుత్వ లక్ష్యం : కలెక్టర్ చేతన్



అమరావతి, ఆగష్టు 4: విద్యార్థుల సమగ్రవికాసానికి నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్ అన్నారు. సోమవారం పెనుకొండ నియోజకవర్గం పాల సముద్రం సమీపంలో గల మాదక ద్రవ్యాలు, కస్టమ్స్ , పరోక్ష పన్నుల జాతీయ అకాడమి (నసిన్ – నేషనల్ అబూా ఆఫ్ కస్టమ్స్, పరోక్ష పన్నుల నార్కోటిక్స్) ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కేంద్రీయ విద్యాలయం లో 1వ తరగతి నుండి 5వ తరగతి వరకు 2025 -26 విద్యా సంవత్సరానికి తరగతుల ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ టి.ఎస్. చేతన్ ముఖ్య అతిథిగా హాజరై తరగతులను ప్రారంభించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, ఇందుకోసం కేంద్రీయ విద్యాలయాన్ని ఏర్పాటు చేసిందన్నారు. తెలుగు , ఇంగ్లిష్ , హిందీ మాధ్యమ విద్యార్థులకు మౌలిక సదుపాయాలను అందించడం ద్వారా భాషాపరంగా, అభ్యాసపరంగా వారిని సమానంగా తీర్చిదిద్దే ప్రయత్నం కొనసాగుతోందన్నారు.

మన ప్రాంతానికి ప్రత్యేకించి నాణ్యమైన ఇంగ్లీష్ విద్య అవసరం ఉంది. గ్లోబల్ స్థాయి లో ఎదగాలంటే భాషా సామర్థ్యం తప్పనిసరి. అయితే, అదే సమయంలో తమ మాతృభాష తెలుగు మీద గౌరవం కోల్పోకుండా, రెండు భాషల్లోనూ చక్కటి ప్రావీణ్యం పెంపొందించేందుకు పాఠశాలలోని అధ్యాపకులు కృషి చేయాలన్నారు.

ఇందుకు పేరెంట్స్-టీచర్స్ మీటింగ్‌ల ద్వారా తల్లిదండ్రులు, బోధన సిబ్బంది మధ్య పరస్పర అవగాహన పెరుగుతుంది. విద్యార్థుల ప్రతిభను గుర్తించి, వారి శారీరక, మానసిక అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవడంలో సమాజం మొత్తం భాగస్వామిగా ఉండాలని కలెక్టర్ సూచించారు. గతంలో జాతీయ రహదారి పక్కన కేంద్రీయ విద్యాలయానికి భూమి కేటాయించామని, అయితే విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని నాసిన్ వెనుక వైపు భూమిని కేటాయించి, ఒకే ప్రాంగణంలో ఏర్పాటు చేశామన్నారు. అయినప్పటికీ హైవే పక్కన ఉండే విద్యా సంస్థల కోసం భద్రతా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు.

విద్యతో పాటు వారికి ఇష్టమైన క్రీడల్లో రాణించడానికి ఉపాధ్యాయులు , తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. క్రీడలు విద్యార్థుల ఆరోగ్యానికి దోహదపడుతాయన్నారు. పాఠశాలలో విద్యార్థుల భవిష్యత్తుకు ఉపాధ్యాయుల పాత్ర ఎంత ఉంటుందో,ఇంటి వద్ద తల్లిదండ్రుల పాత్ర అంతే ఉంటుందన్నారు. ముందుగా జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో నాసిన్ జాయింట్ డైరెక్టర్ డి.సత్య దివ్య రమ్య, డిప్యూటీ డైరెక్టర్ ఈ.శేషు, కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ బి.కృష్ణా రావు, గోరంట్ల తహశీల్దార్ మారుతి, విద్యార్థులు వారి తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

# 'బడుగుల హక్కుల సాధనకు పోరాడిన మహనీయుడు పద్మనాభరెడ్డి'



నల్గొండ, ఆగష్టు4: ప్రగతిశీల భావాలతో పౌరహక్కుల రక్షణకు హైకోర్టు సీనియర్ న్యాయవాది, ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, దివంగత పద్మనాభరెడ్డి అవిశ్రాంత పోరాటం చేశారని పలువురు న్యాయవాదులు కొనియాడారు. సోమవారం పద్మనాభరెడ్డి 12వ వర్ధంతి సందర్భంగా కోదాడ లాయర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ.. అట్టడుగు హక్కుల కోసం పద్మనాభరెడ్డి హైకోర్టులో నిరంతరం న్యాయ పోరాటం సాగించి బాధితులకు అండగా నిలిచారన్నారు.

మానవ హక్కుల ఉల్లంఘన జరిగిన ప్రతి సందర్భంలోనూ తన గళాన్ని వినిపించి బాధితులకు అండగా నిలిచారన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలి కోరారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గట్ల నరసింహారావు, కోదాడ అధ్యక్షుడు అబ్దుల్ రహీం, కార్యదర్శి వెంకటాచలం, సీనియర్ న్యాయవాది సుధాకర్ రెడ్డి, శరత్ బాబు, యశ్వంత్, సిలివేరు వెంకటేశ్వర్లు, ఉయ్యాల నరసయ్య, హేమలత, మురళి, శ్రీధర్, వెంకన్న, పెద్దబ్బాయి పాల్గొన్నారు.

# గ్రానైట్ క్వారీలో ఘోర ప్రమాదం..

## -ఆరుగురు కార్మికుల మృతి

అమరావతి, ఆగష్టు 4:ఆంధ్రప్రదేశ్ బాపట్ల జిల్లాలోని బల్లికురవ సమీపంలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. సత్యకృష్ణ గ్రానైట్ క్వారీలో డ్రిల్లింగ్ పనులు జరుగుతున్న సమయంలో బండరాళ్లు ఒక్కసారిగా విరిగి పడటంతో ఆరుగురు కార్మికులు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటన మరికొంతమందిని తీవ్రంగా గాయపరిచింది. శిథిలాల కింద చిక్కుకున్న వారి కోసం సహాయక చర్యలు ముమ్మరం చేశారు.

ఈ ప్రమాదం జరిగిన సమయంలో అక్కడ మొత్తం 16 మంది కార్మికులు పనిలో నిమగ్నమై ఉన్నారు. ఒక్కసారిగా భారీ శబ్దంతో బండరాళు విరగపడి క్వారీలో గందరగోళం నెలకొంది. ప్రమాద స్థలానికి పోలీసులు చేరుకొని శిథిలాల కింద చిక్కుకున్నవారిని వెలికితీసేందుకు ప్రత్యేక ఆపరేషన్ చేపట్టారు. తీవ్రంగా గాయపడిన వారిని చికిత్స నిమిత్తం అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, కొందరి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

మృతులంతా ఒడిశాకు చెందిన వారని అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. వారి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాద ఘటనపై బాపట్ల జిల్లా కలెక్టర్, ఎస్పీ స్పందించి సహాయక చర్యలను వేగవంతం చేశారు. ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరపాలని వారు స్పష్టం చేశారు.ఇంతలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఘటనపై స్పందించారు. అధికారులను ఫోన్‌లో అడిగి వివరాలు సేకరించిన ఆయన, గాయ పడిన వారికి మెరుగైన వైద్యం అందించాల్సిందిగా ఆదేశించారు. ప్రమాదానికి గల కారణాలను పూర్తిగా దర్యాప్తు చేయాలని అధికారులకు సూచించారు.

# జాతీయ స్థాయి కరాటే పోటీల్లో విద్యార్థిని రిశ్వినికి గోల్డ్ మెడల్





నల్గొండ, ఆగష్టు4: కోదాడ పట్టణంలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని రిశ్విని ఖమ్మంలో జరిగిన జాతీయస్థాయి కరాటే పోటీలు అండర్ 12 విభాగంలో గోల్డ్ మెడల్ సాధించింది.

పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటనారాయణ, ఉపాధ్యాయులు విద్యార్థినిని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి గోవర్ధన్, ఉపాధ్యాయులు కన్నయ్య, రాయుడు, నాంచారయ్య, రవీందర్ పాల్గొన్నారు.

# స్థానిక సమస్యలపై ప్రజా ఉద్యమాలు : తమ్మినేని వీరభద్రం

నల్లగొండ, ఆగస్టు 04 : స్థానిక సమస్యలపై ప్రజా ఉద్యమాలు నిర్వహించనున్నట్లు సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం తెలిపారు. సోమవారం నల్లగొండ పట్టణంలోని అలకాపురి కాలనీలో గల కోటిరెడ్డి ఫంక్షన్ హాల్‌లో సీపీఎం జిల్లా విస్తృత సమావేశం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి హాజరైన తమ్మినేని ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆగస్టు, సెప్టెంబర్ నెలలో గ్రామస్థాయిలో ప్రజా సమస్యలను అధ్యయనం చేసి వాటి పరిష్కారం కోసం క్షేత్రస్థాయిలో ఉద్యమాలు చేయాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ నెల 6 నుంచి 15 వరకు సమస్యలపై సర్వేలు, అధ్యయన బృందాలతో పర్యటన చేయాలన్నారు. ఈ నెల 10 నుంచి 20వ తేదీ వరకు సంతకాల సేకరణ, 20 నుంచి 30వ తేదీ వరకు సమస్యలపై అధికారులకు వినతి పత్రాలు, గ్రామ పంచాయతీల వద్ద ధర్నాలు నిర్వహించాలన్నారు. సెప్టెంబర్ 1న తాసిల్దార్ కార్యాలయాల ముందు ధర్నాలు, ముట్టడిలు నిర్వహించాలన్నారు.

### స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి

రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ కార్యకర్తలు సిద్ధం కావాలని సూచించారు. కేంద్రం లోని బీజేపీ ప్రభుత్వం 11 ఏండ్లు గా ప్రజా సమస్యలను పరిష్కరించకుండా, భావోద్వేగాలను రెచ్చగొడుతూ విధ్వంసకర పాలన చేస్తుందని దుయ్యబట్టారు. దేశ పరువు దిగజారే విధంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యవహరిస్తున్నా ఆ వ్యాఖ్యలను తిప్పికొట్టేందుకు ప్రధాని మోదీ నోరు ఎందుకు మెదపడం లేదో చెప్పాలన్నారు.

### ప్రజల దృష్టి మళ్లేలా కాంగ్రెస్ ప్రభుత్వ చర్యలు

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకుండా, కాళేశ్వరం, బనకచర్ల పేరిట ప్రజల దృష్టి మళ్లిసుందని దుయ్యబట్టారు. ఆచరణ సాధ్యం కానీ హామీలు ఇచ్చి ఇప్పుడు నిధల కొరత పేరిట తప్పించు కోవడాన్ని ఆయన తీవ్రం గా నిరసించారు. ఇచ్చిన వాగ్దానాలు అమలు చేసేంత వరకు గ్రామ స్థాయిలో ప్రజలను చైతన్య పరిచి ఉద్యమాలు చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

### యూరియా కొరత లేకుండా చూడాలి : జూలకంటి రంగారెడ్డి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం వానకాల సీజన్ కొనసాగుతుందని, పెండింగ్‌లో ఉన్న రైతుబంధు, రైతు భరోసాను వెంటనే విడుదల చేయాలన్నారు. రైతులకు యూరియా కొరత రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

పార్టీ నిర్ణయించిన కర్తవ్యాలను క్షేత్రస్థాయిలో అమలు చేయాలని దానికోసం కార్యకర్తలు కృషి చేయాలని కోరారు.

ప్రజా సమస్యలపై బలమైన పోరాటాలు చేసి పార్టీ బలోపేతానికి పాటుపడాలన్నారు.

సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి మాట్లాడుతూ.. భవిష్యత్‌లో పార్టీ తీసుకునే కర్తవ్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, నారి ఐలయ్య, డబ్బికార్ మల్లేశ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాలడుగు నాగార్జున, కందాల ప్రమీల, బండ శ్రీశైలం, చినపాక లక్ష్మీనారాయణ, సయ్యద్ హాసం, వీరేపల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# ఆయిల్‌పామ్ సాగుపై రైతు విజ్ఞాన యాత్ర

ఖమ్మం, ఆగష్టు 4:: మధిర డివిజన్ పరిధిలో బోనకల్లు, చింతకాని మండలాల రైతులకు ఆయిల్‌పామ్ సాగుపై, వ్యవసాయ ఉద్యాన వన శాఖ ఆధ్వర్యంలో సోమవారం రైతు విజ్ఞాన యాత్ర నిర్వహించారు. ఈ రైతు విజ్ఞాన యాత్రలో సత్తుపల్లి మండలం బేతుపల్లి గ్రామంలో గల ఆయిల్‌పామ్ తోటలను రైతులు సందర్శించారు. ఈ సందర్భంగా మధిర సహాయ వ్యవసాయ సంచాలకులు స్వర్ణ విజయ చంద్ర ఆయిల్ పామ్ సాగులో చేపట్టే యాజమాన్య పద్ధతులు, పొందే ప్రయోజనాలు వివరించారు. ఆయిల్ పామ్‌లో సాగు చేస్తున్న రైతులు అంతర పంటలుగా వక్క, మిరియాలు, కోకో వంటి వాటిని సాగు చేస్తూ పొందే ఆదాయం గురించి తెలియజేశారు. అనంతరం దమ్మపేట మండలంలో గల అప్పారావుపేట నందు గల ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని సందర్శించారు.

ఈ కార్యక్రమంలో బోనకల్లు, చింతకాని మండల వ్యవసాయ అధికారులు పసునూరి వినయ్ కుమార్, సోములపల్లి మానస, మధిర ఉద్యాన వన అధికారి విష్ణు, వ్యవసాయ విస్తరణ అధికారులు బంధం రజిత, మరీదు త్రివేణి, గోగుల హరికృష్ణ, నాగినేని నాగసాయి, బోయినపల్లి రాము, మురికిపుడి తేజ, బద్దల కార్తీక్, ధారగాని కళ్యాణి, షేక్ అయేషా, ఫాతిమా, ఎండీ తాహియా నౌషీన్, ఆయిల్ పామ్ ఏరియా అధికారి బి.నరేశ్, రైతులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో వేగం పెంచాలి : ఎంపీడీవో బాలయ్య

మెదక్, ఆగష్టు 4: ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో వేగం పెంచి తొందరగా పూర్తి చేయాలని రాయపోల్ ఎంపీడీవో బాలయ్య అన్నారు. ఎంపీఓ శ్రీనివాస్‌తో కలిసి సోమవారం రాయపోల్ మండలం టెంకంపేట గ్రామపంచాయతీలో జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు.మొదటి విడతలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు తొందరగా పనులు ప్రారంభించి పూర్తి చేయాలని కోరారు. బేస్‌మెంట్ వరకు నిర్మాణం పూర్తి చేసిన వారికి వెంటనే లక్ష రూపాయల బిల్లు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు లబ్ధిదారులతో మాట్లాడుతూ.. ఇండ్ల నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేసే విధంగా కృషి చేయాలని ఆదేశించారు.

# విద్య, వైద్యాన్ని జాతీయాకరణ చేయాల్సిన అవసరముంది : ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి




78 ఏళ్ల స్వాతంత్ర భారతంలో నేటికీ విద్య, వైద్యం పేదలకు అందని ద్రాక్షగా మారిందని, విద్య, వైద్యాన్ని జాతీయాకరణ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. తొగుట మండలం ఘన్‌పూర్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో మాజీ ఎమ్మెల్సీ ఫారుక్ హుస్సేన్ మనుమలు, మనుమరాలు ఎండి కరీమొద్దీన్, యాసీనుద్దీన్ అయేషా సుల్తానాలు తమ జన్మదినం సందర్భంగా విద్యార్థులకు బ్యాగులు సమకూర్చగా.. ఆయనతో కలిసి ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను రాజకీయాల్లోకి రాకముందే కేపీఆర్ ట్రస్ట్ ద్వారా పాఠశాలల్లో పుస్తకాలు, బ్యాగులు అందించడం జరిగిందని గుర్తు చేశారు. నేడు ప్రతి ఒక్కరి సంపాదనలో సింహభాగం విద్య, ఆరోగ్యానికి కేటాయిస్తున్నా.. నాణ్యమైన విద్య అందడం లేదన్నారు. ప్రభుత్వాలు ఎన్ని మారినా విద్య, ఆరోగ్య వ్యవస్థలో మార్పు రావడం లేదన్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా అదే ధోరణి కనిపిస్తుంది. ఘనపూర్‌లో 10 మందికి పైగా టీచర్లు ఉన్నప్పటికీ విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందన్నారు. ప్రభుత్వ టీచర్లు కానీ.. వారే ప్రయివేటు పాఠశాలల్లో పనిచేస్తున్న విషయాన్ని గుర్తించుకోవాలని ప్రజలను కోరారు.. ప్రభుత్వం కూడా ప్రైవేట్ కు ధీటుగా పాఠశాలలను తీర్చిదిద్దాలి.. రాజకీయాలు పక్కన పెట్టి భావి భారత సమాజం కోసం దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం కృషి..

విద్య, వైద్యం వ్యాపారంగా మారిందని వాటిని జాతీయాకరణ చేయాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామాల్లో ఎవరికి వారు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఫారుక్ హుస్సేన్ మాట్లాడుతూ.. జన్మదిన వేడుకల ఖర్చును ఇలా పేద విద్యార్థుల సహాయం కోసం మా మనుమలు, మనుమరాళ్లు ఖర్చు చేయడం సంతోషంగా ఉందన్నారు.. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు అంజలి ఎమ్మెల్యేతోపాటు ముఖ్య అతిధులను ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ కె హరికృష్ణా రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి, దుబ్బాక పట్టణ అధ్యక్షుడు వంశీకృష్ణా గౌడ్, నాయకులు సికిందర్, చిలువేరి మల్లారెడ్డి, బోధనం కనకయ్య, కొమ్ము శరత్, కలీమొద్దీన్, వేల్పుల స్వామి, శేఖర్ గౌడ్, మంగ నర్సింలు, ఎల్లం, రాజిరెడ్డి, రాజశేఖర్, కిరణ్ కుమార్ రెడ్డి, నరేందర్ గౌడ్, రమేష్, అక్కం స్వామి,భైరాగౌడ్, అశోక్,దుబ్బాక కనకయ్య, వెంకటేష్, ప్రభాకర్ రెడ్డి, రాజిరెడ్డి, యాదగిరి, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్ఎంపి వైద్యులతో సమీక్షా సమావేశం నిర్వహించిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవి రాథోడ్




మహబూబాబాద్, ఆగష్టు 4:(నేటినిజం ప్రతినిధి): సోమవారం జిల్లా కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో డిఎస్పి తిరుపతిరావు, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ నెహ్రూ, సి డబ్ల్యూ సి మెంబర్స్, సంబంధిత వైద్య అధికారులతో కలిసి జిల్లాలోని ఆర్ఎంపి లతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి రాథోడ్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో లింగ నిర్ధారణ పరీక్షలు, అర్హతకు మించి వైద్యం చేయరాదని తమ పరిధిలో ఉన్న ప్రభుత్వ సూచనల ప్రకారం మాత్రమే వైద్య సేవలు కొనసాగించాలని ఆయన అన్నారు, కొన్ని కొన్ని సందర్భాలలో క్షేత్రస్థాయిలో ఆర్ఎంపి సెంటర్లను సందర్శించగా అనధికారికంగా వైద్య సేవలు కొనసాగిన దృశ్యాలను గమనించడం జరిగిందన్నారు. అట్టి చర్య ఎట్టి పరిస్థితుల్లో చేయరాదని ఆయన ఆర్ఎంపి వైద్యులను ఆదేశించారు.డిఎస్పి తిరుపతిరావు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ఆర్ఎంపి వైద్యుల సేవలు బాధ్యతాయుతంగా నిర్వహించి ప్రజలకు సేవలు అందించాలి అని చెప్పారు, కరోనా కష్టకాలంలో ప్రజలకు ఎంతో సేవలు అందించారని వారికి గుర్తుకు చేశారు,సిడబ్ల్యుసి చైర్ పర్సన్ నాగవాణి, మెంబర్స్ పరికిపండ్ల అశోక్, అధ్యక్షుడు డాక్టర్ నెహ్రూ, సంబంధిత వైద్యుడు ప్రోగ్రాం అధికారులు ఆర్ఎంపిలకు తగు సూచనలు చేశారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది కె ప్రసాద్, రాజు,సిబ్బంది, ఆర్ఎంపి వైద్యుల సంఘం నుండి రవీంద్రాచారి, నజీర్, ఆర్ఎంపి, పి ఎం పి వైద్యులు పాల్గొన్నారు.

# ఇప్పుడీ పాదయాత్రల మర్మమేమిటో..

హైదరాబాద్, ఆగష్టు 4:ఒక్క తెలుగు రాష్ట్రాల్లో నే కాక జాతీయ స్థాయి నాయకులూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు, అధికారంలోకి రావడానికి ఎంచుకునే ఆయుధాల్లో పాదయాత్రలు ముఖ్యమైనవి. అవి చాలామందికి అచ్చొచ్చాయి కూడా. పాదయాత్రల వల్ల చాలా ప్రయోజనాలున్నాయి. అన్నివర్గాల ప్రజలతో మమేమకం కావచ్చు. సమస్యలు తెలుసుకోవచ్చు, అధికార పార్టీల వైఫల్యాలను అడుగడుగునా ఎండగట్టవచ్చు. ఎలాగూ మీడియా, లైవ్ కవరేజ్ ఉంటుంది కాబట్టి, ప్రతి అడుగూ, ప్రతి మాటా ప్రజల మనసులో బలంగా నాటుకు పోతుంది.

అయితే ఇక్కడ విశేషమేమంటే తెలంగాణ లో స్పష్టమైన మెజారిటీతో అధికారంలోకొచ్చిన తెలంగాణ పార్టీ తెలంగాణ ప్రభుత్వ పనితీరుపై ప్రజాస్పందన ఎలా ఉంది. ప్రజలు ప్రజా ప్రభుత్వ తీరుపై ఏ విధంగా స్పందిస్తున్నారు. ఇంకా ఎలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తే బాగుంటుందనే విషయాలపై ప్రజల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకోవడం కోసం రాష్ట్ర కాంగ్రెస్ జనహిత యాత్ర ను ప్రారంభించింది.

ఈ యాత్రపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ పాదయాత్ర చేయడమేమిటని విపక్షాలు విమర్శల బాణాలు వదులుతున్నాయి. ప్రజల సమస్యలు తీర్చకుండా, స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకుండా కాలయాపన చేయడానికి రోడ్డుపై తిరుగుతున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఈ యాత్ర కేవలం ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులు శ్రీధర్‌బాబు, కొండా సురేఖ, పరిగి ఎమ్మెల్యే రాంమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో మాత్రమే కొనసాగుతోంది. సీఎం రేవంత్ ఈ యాత్రలో భాగస్వామ్యం కాకపోవడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

సీఎంను నెమ్మదిగా పక్కకు పెట్టడానికీ, తమ వర్గం యొక్క ప్రాబల్యం పెంచుకోవడానికే ఈ పాదయాత్ర తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్ ఆధ్వర్యంలో చేపడుతు న్నారా.. అనే అనుమానాలు వస్తున్నాయి.

అయితే సీఎం రేవంత్ రెడ్డి బీసీ రిజర్వేషన్ల పై ఢిల్లీలో చేపట్టే ఆందోళనలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి పాల్గొంటున్న నేపథ్యంలోనే కాంగ్రెస్ జనహిత పాదయాత్రలో పాల్గొనడం లేదని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. నిజానిజాలు ఏమైనా.. కాంగ్రెస్ పార్టీ ఈ సమయంలో చేపట్టిన పాదయాత్ర పార్టీకి ప్లస్సా.. మైనస్సా అనేది భవిష్యత్‌లో జరిగే ఎన్నికలు నిర్ణయిస్తాయి.

తెలంగాణ కాంగ్రెస్ ఇంచార్జి మీనాక్షి నటరాజన్ రాష్ట్రంలో కొన్ని ఎంపిక చేసుకున్న నియోజకవర్గాల్లో పాదయాత్ర, శ్రమదానం పేరుతో పర్యటిస్తున్న సందర్భంగా రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. జూలై 31న రంగారెడ్డి జిల్లా ప్రారంభమైన కాంగ్రెస్ జనహిత యాత్ర నుంచి ఆదిలాబాద్ జిల్లా ఖానాపూర్ లో నిర్వహించే సమావేశంతో ముగియనుంది. రంగాపూర్ నుంచి పరిగి వరకు ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు శ్రీధర్‌బాబు, కొండా సురేఖ, పరిగి ఎమ్మెల్యే రాంమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ యాత్ర ర్యాలీగానే కొనసాగిందని విపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి.. 'ఈ ప్రాంతం అభివృద్ధికి ఏమేమీ కావాలి, సంక్షేమ పథకాలు ఎలా అందుతున్నాయి, ఇంకా ఎలాంటి సంక్షేమ పథకాలు అమలు చేయాలి' అని నేతలు అడిగి తెలుసుకుంటారని ఈ ప్రాంతవాసులందరూ ఆశించారు.

తీరా చూస్తే ఇలా వచ్చి, అలా వెళ్లిపోయారని పలువురు పెదవి విరిచారు. "దారి పొడవునా ఏ ఒక్క సామాన్యుడినీ కలిసింది లేదు, మాట్లాడింది లేదు'' అని ఆరోపిస్తున్నారు. నాయకులను కలిసేందుకు ప్రయత్నించినా వారిని సైతం పోలీసులు లాగి పక్కకు తోసేయడం విడ్డూరంగా ఉందని విపక్ష నాయకులు అంటున్నారు.

# వారణాసిలో దాదాపు రూ. 2,200 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ,ఆగష్టు 4:ఉత్తరప్రదేశ్ లోని వారణాసిలో దాదాపు రూ.2,200 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. సభనుద్దేశించి ప్రసంగిస్తూ.. పవిత్ర శ్రావణ మాసం సందర్భంగా వారణాసిని సందర్శించడం, ఇక్కడి ప్రజలను కలవడం తనకెంతో ఆనందాన్నిచ్చిందన్నారు. వారణాసి ప్రజలతో తనకు భావోద్వేగ అనబంధముందన్న శ్రీ మోదీ.. ఆదరాభిమానాలను కనబరిచిన నగర ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపా రు. పవిత్ర శ్రావణ మాసం సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దేశవ్యాప్తంగా రైతులతో సంభాషించడంపై శ్రీ మోదీ సంతృప్తి వ్యక్తం చేశారు.

ఆపరేషన్ సిందూర్ తర్వాత తాను వారణాసిలో పర్యటించడం ఇదే మొదటిసారి అని ప్రధానమంత్రి చెప్పారు. ఏప్రిల్ 22న పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడిని ఆయన గుర్తుచేస్తూ.. 26 మంది అమాయకులను ఉగ్రవాదులు దారుణంగా హతమార్చారన్నారు. ఈ ఘటనతో బాధిత కుటుంబాలు క్షోభకు గురయ్యాయని, ముఖ్యంగా ఇది చిన్నారులకు అంతులేని విషాదాన్ని మిగిల్చిందని శ్రీ మోదీ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ సమయంలో తన హృదయం తీవ్ర దుఃఖంతో నిండిపోయిందని, మృతుల కుటుంబాలకు మానసిక స్థైర్యాన్ని ప్రసాదించాలని బాబా విశ్వనాథ్‌ను ప్రార్థించానని చెప్పారు. మన బిడ్డల సిందూరాన్ని నేలరాల్చిన ముష్కరులపట్ల తప్పక ప్రతీకారం తీర్చుకుంటానని మాటిచ్చి, దాన్ని నిలబెట్టుకున్నానని శ్రీ మోదీ పేర్కొన్నారు. మహాదేవుడి ఆశీస్సుల వల్లే ఈ విజయం సాధ్యమైందని, ఆపరేషన్ సిందూర్ విజయాన్ని ఆయన పాదాల చెంత అంకితం చేస్తున్నానని ప్రధానమంత్రి ప్రకటించారు.

ఈ మధ్య, ముఖ్యంగా శ్రావణ మాసం మొదటి సోమవారం రోజు శివభక్తులు, యాత్రికులు బాబా విశ్వనాథుడికి పవిత్ర జలాలతో అభిషేకం చేయడానికి గంగాజలంతో వెళ్తున్న దృశ్యాలు బాగా కనిపిస్తున్నాయన్నారు. గౌరీ కేదార్‌నాథ్ నుంచి యాదవ సోదరులు గంగాజలాన్ని భుజాలపై మోసుకెళ్తున్న మనోహరమైన దృశ్యాన్ని గుర్తు చేసుకుంటూ.. అది నిజంగా మంత్రముగ్ధులను చేసే సన్నివేశమన్నారు. డమరుక నాదాలు, భక్తుల్లోని ఉత్తేజం… అదో అసాధారణ వాతావరణమన్నారు. పవిత్ర శ్రావణ మాసంలో బాబా విశ్వనాథుడు, మార్కండేయ మహాదేవులను దర్శించుకోవాలన్న కోరిక తనకెప్పటినుంచో ఉందని శ్రీ మోదీ చెప్పారు. అయితే, తను అక్కడికి వెళ్తే భక్తులకు అసౌకర్యమూ, దర్శనానికి అంతరాయమూ కలుగుతాయని.. అందుకే ఆ బోలా శంకరుడికి, గంగామాతకు ఇక్కడి నుంచే నమస్సులు అర్పిస్తున్నట్టు శ్రీ మోదీ తెలిపారు.

వెయ్యేళ్ల నాటి ప్రాచీన ఆలయం, దేశంలో శైవ సంప్రదాయానికి పురాతన కేంద్రమైన తమిళనాడులోని చరిత్రాత్మక గంగైకొండ చోళపురం ఆలయాన్ని కొన్ని రోజుల కిందట తాను దర్శించిన విషయాన్ని ప్రధానమంత్రి ఈ సందర్భంగా శ్రీ మోదీ గుర్తు చేసుకున్నారు. ఆ ఆలయాన్ని నిర్మించిన రాజేంద్ర చోళుడు ఉత్తర భారతదేశం నుంచి గంగాజలాన్ని అక్కడికి తీసుకెళ్లాడని, ఇది ఉత్తర, దక్షిణ భారతదేశాల ఐక్యతకు చిహ్నమని ప్రధానమంత్రి పేర్కొన్నారు. శివభక్తి, శైవ సంప్రదాయం పట్ల అంకితభావంతో.. రాజేంద్ర చోళుడు వెయ్యేళ్ల కిందటే 'ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్' సంకల్పాన్ని చాటాడని శ్రీ మోదీ చెప్పారు. కాశీ-తమిళ సంగమం వంటి కార్యక్రమాల ద్వారా నేడు ఆ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. ఇటీవల గంగైకొండ చోళపురం వెళ్లినప్పుడు గంగాజలాన్ని వెంట తీసుకెళ్లానని, గంగామాత ఆశీస్సులతో అత్యంత పవిత్ర వాతావరణంలో పూజా కార్యక్రమం జరిగిందని ఆయన వెల్లడించారు. ఇవి దేశంలో ఐక్యతా స్ఫూర్తిని రగిలిస్తాయనని, ఆపరేషన్ సిందూర్ వంటి మిషన్లు విజయవంతమవుతాయని అన్నారు. 140 కోట్ల భారతీయుల ఐక్యతే ఆపరేషన్ సిందూర్‌కు బలంగా నిలిచిందని ఆయన వ్యాఖ్యానించారు.

వారణాసిలో నిర్వహిస్తున్న రైతు వేడుకలను ప్రముఖంగా ప్రస్తావిస్తూ.. పీఎం-కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద దేశవ్యాప్తంగా 10 కోట్ల రైతు సోదరీసోదరుల బ్యాంకు ఖాతాలకు రూ. 21,000 కోట్లు బదిలీ చేసినట్టు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రూ. 2,000 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసినట్టు తెలిపారు. బాబా ఆశీస్సులతో వారణాసిలో నిరంతర అభివృద్ధి వాహిని ప్రవహిస్తోందని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు. హాజరైన, దేశంలోని రైతులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. కొన్ని రోజుల కిందటే వారణాసిలో ఎంపీ- పర్యాటక గైడ్ల పోటీ జరిగిందని ప్రధానమంత్రి తెలిపారు. రాబోయే రోజుల్లో కాశీ ఎంపీ- ఫొటోగ్రఫీ కాంపిటీషన్, ఎంపీ- ఉద్యోగ నియామక కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమాలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఇలాంటి కార్యక్రమాల నిర్వహణ ప్రశంసనీయమన్నారు.

రైతుల పేరిట చేసిన ఏ ఒక్క ప్రకటనా సరిగ్గా నెరవేర్చని గత ప్రభుత్వాల మాదిరిగా కాకుండా.. తమ ప్రభుత్వం నిరంతరం రైతుల సంక్షేమం కోసం పనిచేస్తోందన్న శ్రీ మోదీ చెప్పారు. తమ ప్రభుత్వం వాగ్దానాలను కచ్చితంగా నెరవేరుస్తుందని స్పష్టం చేశారు. ప్రధాన మంత్రి-కిసాన్ సమ్మాన్ నిధి తమ ప్రభుత్వ దృఢ నిబద్ధతకు నిదర్శనమన్నారు.

2019లో పీఎం కిసాన్ సమ్మాన్ నిధిని ప్రారంభించబడినప్పుడు.. కొన్ని ప్రధాన ప్రతిపక్షాలు అనేక పుకార్లను వ్యాప్తి చేశాయని శ్రీ మోదీ గుర్తుచేసుకున్నారు. ఎన్నికల తర్వాత చెల్లింపులు ఆగిపోతాయని కొందరు చెప్తే.. అప్పుడు పంపిణీ చేసిన డబ్బును తిరిగి తీసుకుంటామని కూడా ఇంకొందరు దుష్ప్రచారం చేశారన్నారు. రైతులను, దేశ ప్రజలను తప్పుదారి పట్టించడమే ప్రతిపక్ష నిజ స్వభావమని విమర్శించారు. ఇప్పటి వరకు ఒక్క వాయిదా అయినా ఆగిందా అని ప్రశ్నించారు. ఎలాంటి అంతరాయమూ లేకుండా పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం కొనసాగుతోందని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు రూ. 3.75 లక్షల కోట్లు నేరుగా రైతుల ఖాతాల్లోకి బదిలీ చేసినట్టు ఆయన పేర్కొన్నారు. ఒక్క ఉత్తరప్రదేశ్‌లోనే దాదాపు 2.5 కోట్ల రైతులు ఈ పథకం కింద రూ. 90,000 కోట్లకు పైగా ప్రయోజనం పొందారని, వారణాసి రైతులు దాదాపు రూ. 900 కోట్లు పొందారని శ్రీ మోదీ తెలిపారు. ఎలాంటి కోతలు, కమిషన్లు లేకుండా నేరుగా రైతుల ఖాతాల్లోకే నిధులు చేరడం ఈ పథకంలోని అతి ముఖ్యమైన అంశమని ప్రధానమంత్రి వివరించారు. పక్కదారి పట్టే అవకాశం ఉండదని, పేదల హక్కులు తిరస్కరణకు గురికాకుండా – ఇది తమ ప్రభుత్వం చేసిన శాశ్వత ఏర్పాటు అని ఆయన వ్యాఖ్యానించారు.

'వెనుకబడి ఉన్న ప్రాంతాలకే మొదటి ప్రాధాన్యం' అనేది తమ అభివృద్ధి మంత్రమని పునరుద్ఘాటించిన శ్రీ మోదీ.. ఈ నెల మొదట్లో 'ప్రధానమంత్రి ధన ధాన్య కృషి యోజన' అనే ఓ ముఖ్యమైన పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ఆమోదించిందని ప్రకటించారు. ఈ పథకానికి రూ. 24,000 కోట్లు కేటాయిస్తామని ఆయన తెలిపారు. గత ప్రభుత్వాల లోపభూయిష్ట విధానాల కారణంగా వెనుకబడిన జిల్లాలపై ఈ కార్యక్రమం ద్వారా దృష్టి సారిస్తామని ప్రధానమంత్రి చెప్పారు. వ్యవసాయ దిగుబడి తక్కువ ఉన్న, రైతుల ఆదాయాలు పరిమితంగా ఉన్న ప్రాంతాల అభివృద్ధి ఈ పథకం లక్ష్యమన్నారు. ప్రధానమంత్రి ధన ధాన్య కృషి యోజన ద్వారా ఉత్తరప్రదేశ్‌లోనూ లక్షలాది రైతులకు నేరుగా ప్రయోజనం చేకూరుతుందని ఆయన చెప్పారు.

''రైతుల జీవితాల్లో మార్పు తేవడానికి, వారి ఆదాయాన్ని పెంచడానికి, సాగు వ్యయాన్ని తగ్గించడానికి మా ప్రభుత్వం పూర్తి శక్తియుక్తులతో పనిచేస్తోంది. విత్తన దశ నుంచి మార్కెట్ వరకు రైతులకు అండగా నిలుస్తున్నాం" అని ప్రధానమంత్రి అన్నారు. వ్యవసాయ క్షేత్రాలకు నీరందించడం కోసం దేశవ్యాప్తంగా లక్షల కోట్ల రూపాయల విలువైన నీటిపారుదల పథకాలను అమలు చేస్తున్నట్టు శ్రీ మోదీ చెప్పారు.

అధిక వర్షపాతం, వడగళ్ల వాన లేదా మంచు తుఫాను… ఏదైనా సరే ప్రతికూల వాతావరణం రైతులకు ఎల్లప్పుడూ పెద్ద సవాలుగా నిలుస్తోందన్నారు. అలాంటి అనిశ్చితుల నుంచి రైతులను రక్షించడానికే ప్రభుత్వం ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను ప్రారంభించిందన్నారు. ఈ పథకం కింద ఇప్పటి వరకు రైతులకు రూ. 1.75 లక్షల కోట్లకు పైగా విలువైన క్లెయిమ్‌లు పరిష్కారమయ్యాయని తెలిపారు.

రైతులకు తమ ఉత్పత్తులపై న్యాయమైన ధరలు అందించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. బియ్యం, గోధుమల వంటి కీలకమైన ఆహారోత్పత్తులు సహా పంటల కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) రికార్డు స్థాయిలో పెరిగిందన్నారు. రైతుల పంటలను కాపాడడం కోసం దేశవ్యాప్తంగా ప్రభుత్వం వేలాదిగా కొత్త గిడ్డంగులను నిర్మిస్తోందని తెలిపారు.

వ్యావసాయిక ఆర్థిక వ్యవస్థలో మహిళా భాగస్వామ్యాన్ని పెంచడంపై ప్రభుత్వం దృష్టి సారించిందని చెప్తూ.. 'లాఖ్‌పతి దీదీ' కార్యక్రమాన్ని శ్రీ మోదీ ప్రస్తావించారు. దేశవ్యాప్తంగా మూడు కోట్ల లాఖ్‌పతి దీదీలను సృష్టించడం దీని లక్ష్యమని వివరించారు. ఇప్పటికే 1.5 కోట్లకు పైగా మహిళలు ఈ లక్ష్యాన్ని సాధించారని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ 'డ్రోన్ దీదీ' కార్యక్రమం లక్షలాది మహిళల ఆదాయాన్ని గణనీయంగా పెంచిందన్నారు.

ఆధునిక వ్యవసాయ పరిశోధనలను నేరుగా వ్యవసాయ క్షేత్రాలకే తీసుకొచ్చేలా ప్రభుత్వం క్రియాశీలంగా పనిచేస్తోందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. 'ప్రయోగశాలల నుంచి వ్యవసాయ క్షేత్రాలకు (ల్యాబ్ టు ల్యాండ్)' అనే మార్గదర్శక సూత్రం కింద వికసిత కృషి సంకల్ప్ అభియాన్‌ను ప్రత్యేకంగా రూపొందించి.. ఈ ఏడాది మే, జూన్ నెలల్లో నిర్వహించినట్లు తెలిపారు. వీటిలో 1.25 కోట్లకు పైగా రైతులు ప్రత్యక్షంగా భాగస్వాములయ్యారు. కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు ఎప్పటికే ఇలాగే సజావుగా ప్రజలకు చేరుతాయని ప్రధానమంత్రి స్పష్టం చేశారు.

''జన్ ధన్ యోజన కింద దేశవ్యాప్తంగా పేదల కోసం 55 కోట్ల బ్యాంకు ఖాతాలు తెరిచాం" అంటూ కీలకమైన అంశాన్ని ప్రజలకు వివరించారు. ఈ పథకానికి ఇటీవలే పదేళ్లు పూర్తయ్యాయనీ.. నిబంధనల ప్రకారం పదేళ్ల తర్వాత బ్యాంకు ఖాతాలకు కొత్తగా కేవైసీ ధ్రువీకరణ అవసరమని ఆయన తెలిపారు. ఇందుకోసం 2025 జూలై 1 నుంచి దేశవ్యాప్త కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. బ్యాంకులు ప్రతి ఊరినీ చేరుతున్నాయని, దాదాపు లక్ష గ్రామ పంచాయతీలలో ఇప్పటికే శిబిరాలు ఏర్పాటు చేశామని, లక్షలాది ప్రజలు విజయవంతంగా కేవైసీని పునరుద్ధరించుకున్నారని ప్రధానమంత్రి తెలిపారు. జన్ ధన్ ఖాతా ఉన్న ప్రతి వ్యక్తీ జాప్యం చేయకుండా కేవైసీ ప్రక్రియను పూర్తిచేయాలని ప్రధానమంత్రి కోరారు.

గ్రామాల్లో నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక బ్యాంకు శిబిరాలతో మరో ప్రయోజనం కూడా ఉందన్నారు. వీటి ద్వారా ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన సహా అనేక కీలక పథకాలకు రిజిస్ట్రేషన్లను సులభతరమవుతున్నాయని శ్రీ మోదీ పేర్కొన్నారు. ఈ పథకాలు పౌరులకు ఎంతగానో ఉపయోగపడతాయని, ప్రతి ఒక్కరూ ఈ శిబిరాలను సందర్శించాలని కోరారు. ఈ పథకాల్లో ఇంకా నమోదు చేసుకోని వారు వెంటనే నమోదు చేసుకోవాలని, అలాగే జన్ ధన్ ఖాతాలకు కేవైసీ ప్రక్రియను పూర్తి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంపై విరివిగా అవగాహన పెంచాలని, ప్రజల్లోకి వెళ్లడంలో బ్యాంకులకు సహకరించాలని, ప్రజలు పెద్ద సంఖ్యలో భాగస్వాములయ్యేలా చూడాలని తమ పార్టీ ప్రజా ప్రతినిధులందరికీ ప్రధానమంత్రి పిలుపునిచ్చారు.

మహాదేవుని నగరంలో ఈ రోజు చాలా అభివృద్ధి, ప్రజా సంక్షేమం కార్యక్రమాలు చేపట్టామని ప్రధాన మంత్రి అన్నారు. ఈ సందర్భంగా శివుడి అర్థాన్ని ఆయన వివరించారు. శివుడంటే "సంక్షేమం" అని.. కానీ ఉగ్రవాదం, అన్యాయాన్ని ఎదుర్కొనే విషయంలో రుద్ర రూపాన్ని కూడా ఆయన కలిగి ఉంటాడని అన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారతదేశ రుద్ర రూపాన్ని ప్రపంచం చూసిందని ప్రధానంగా పేర్కొన్నారు. "భారత్‌పై దాడి చేసే ఎవరైనా పాతాళంలో ఉన్నా తప్పించుకోలేరు" అని ప్రకటించారు. ఆపరేషన్ సిందూర్ విజయం సాధించినప్పటికీ.. దీనిపై దేశంలోని కొందరు ఇబ్బంది పడుతుండటంపై విచారం వ్యక్తం చేశారు. పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలను భారత్ నాశనం చేసిన తీరును వారు జీర్ణించుకోలే కపోతున్నా రంటూ ప్రతిపక్ష పార్టీని, దాని మిత్ర పక్షాలను విమర్శించారు. ఉగ్రవాదులకు చెందిన ప్రధాన స్థావరా లను భారత డ్రోన్లు శిథిలావస్థకు చేర్చిన తీరును మోదీ ప్రస్తావించారు. ఇప్పటికీ ఆ దేశంలోని చాలా వైమానిక స్థావరాలు కోలుకోలేని స్థితిలో ఉన్నాయని తెలిపారు. ఉగ్ర సూత్రధారులు ఒక వైపు విచారం వ్యక్తం చేస్తుంటే.. వారి పరిస్థితిని చూసి మరోవైపు ఈ పార్టీలు కూడా విచారం వ్యక్తం చేస్తున్నాయని విమర్శించారు.

భారత సాయుధ దళాల పరాక్రమాన్ని పదే పదే అవమాని స్తున్నందుకు ప్రతిపక్షాలను తీవ్రంగా విమర్శించారు. ఆపరేషన్ సిందూర్‌ను "తమాషా"గా ప్రతిపక్షాలు పేర్కొన్నాయని అన్నారు. గౌరవం, త్యాగానికి చిహ్నంగా ఉన్న సిందూర్‌ను ఎప్పుడైనా నాటకంగా పరిగణించొచ్చా అని ప్రశ్నించారు. సోదరీమణుల సిందూర్‌ను చెరిపేసిన సంఘటనపై ప్రతీకారం తీర్చుకున్న, సాయుధ దళాల మనోధైర్యానికి ప్రతీకగా ఉన్న ఈ గొప్ప కార్యాన్ని ఈ విధంగా తక్కువ చేసి మాట్లాడొచ్చా అని ఆయన అడిగారు.

ప్రతిపక్షాలు ఓటు బ్యాంకు, బుజ్జగింపు రాజకీయాలకు పాల్పడటాన్ని ప్రధాని ఖండించారు. పహల్గామ్ దాడి చేసిన ఉగ్రవాదులను వెంటనే ఎందుకు మట్టుబెట్టారని ప్రశ్నిస్తూ పార్లమెంటులో ప్రతిపక్ష నాయకులు చేసిన వ్యాఖ్యలను ఆయన ఉదహరించారు. ఉగ్రవాదులపై చర్య తీసుకునేందుకు భారత్ వేచి చూడాలా అని హాజరైన వారిని అడిగారు. వీళ్లే బాంబు దాడులు చేసిన ఉగ్రవాదులను ఉత్తరప్రదేశ్‌లో అధికారంలో ఉన్నప్పుడు నిర్దోషులుగా తేల్చి కేసులను ఉపసంహరించుకున్నారని ప్రజలకు గుర్తు చేశారు. ఉగ్రవాదులను ఏరివేయటం, అది కూడా ఆపరేషన్ సిందూర్ పేరును ఉపయోగించటంతో ఈ పార్టీలు ఇప్పుడు ఇబ్బంది పడుతున్నాయని అన్నారు. భోలేనాథుని పూజించే ఈ సరికొత్త భారత్‌కు శత్రువుల ముందు కాల భైరవుడిగా ఎలా మారాలో కూడా తెలుసని ప్రకటించారు.

"ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత స్వదేశీ ఆయుధ శక్తి, వైమానిక రక్షణ వ్యవస్థలు, స్వదేశీ క్షిపణులు, డ్రోన్ల సామర్థ్యాన్ని ప్రపంచం తెలుసుకుంది. ఈ ఆపరేషన్ ఆత్మనిర్భర్ భారత్ శక్తిని తెలియజేసింది" అని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. బ్రహ్మోస్ క్షిపణుల ప్రభావాన్ని ప్రత్యేకంగా వర్ణించారు. వాటి ఉనికి ప్రతి శత్రువు గుండెల్లో భయాన్ని నింపిందని పేర్కొన్నారు.

త్వరలో ఉత్తరప్రదేశ్‌లో బ్రహ్మోస్ క్షిపణులు తయారుకానున్నాయని.. ఈ విషయం పట్ల రాష్ట్రం నుంచి ఎన్నికైన పార్లమెంటు సభ్యుడిగా గర్వంగా ఉన్నట్లు తెలిపారు. లక్నోలో బ్రహ్మోస్ క్షిపణుల ఉత్పత్తి ప్రారంభమౌతోందని, అనేక ప్రధాన రక్షణ సంస్థలు రాష్ట్రంలోని రక్షణ నడవాలో ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాయని ఆయన ప్రకటించారు. రాబోయే కొన్ని సంవత్సరాల్లో రాష్ట్రంలో తయారయ్యే ఆయుధాలు దేశ సైనిక శక్తిలో కీలకంగా మారుతాయని తెలిపారు. ఈ విషయం పట్ల గర్వపడుతున్నారా అని సభకు హాజరైన ప్రజలను అడిగారు. పాకిస్థాన్ మరొక దుష్కార్యానికి పాల్పడితే ఉత్తరప్రదేశ్‌లో తయారయ్యే క్షిపణులు ఉగ్రవాదులను మట్టుబెడతాయని అన్నారు.

పెట్టుబడులు పెట్టేందుకు ప్రధాన జాతీయ, అంతర్జాతీయ కంపెనీలను ఆకర్షిస్తూ పారిశ్రామికాభివృద్ధిలో ఉత్తరప్రదేశ్ దూసుకుపోతోందని మోదీ ప్రధానంగా చెప్పారు. ఈ మార్పునకు తమ ప్రభుత్వం అనుసరిస్తోన్న అభివృద్ధి ఆధారిత విధానాలే కారణమని అన్నారు. నేరస్థులు నిర్భయంగా తిరిగే, రాష్ట్రానికి వచ్చేందుకు పెట్టుబడిదారులు వెనుకడుగు వేసే పరిస్థితులున్న గత ప్రభుత్వాల కాలాన్ని ప్రస్తుత పరిస్థితులను ఆయన పోల్చారు. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నాయకత్వంలో ఇప్పుడు నేరస్థులు భయపడుతున్నారని, రాష్ట్ర భవిష్యత్తుపై పెట్టుబడిదారులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారని ప్రధానంగా పేర్కొన్నారు. వారణాసిలో నిరాటంకంగా కొనసాగుతోన్న అభివృద్ధి పనులపై సంతృప్తి వ్యక్తం చేసిన ప్రధాని.. వేగంగా కొనసాగుతోన్న అభివృద్ధికి సంబంధించి ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాన్ని అభినందించారు.

కొత్త రైల్వే ఓవర్ బ్రిడ్జి, జల్ జీవన్ మిషన్ కింద చేపట్టిన కార్యక్రమాలు, వారణాసిలో పాఠశాలల పునర్నిర్మాణం, హోమియోపతిక్ కళాశాల నిర్మాణం, మున్షి ప్రేమ్‌చంద్ సాంస్కృతిక వారసత్వ సంరక్షణకు సంబంధించిన పనులతో సహా ఈ రోజు ప్రారంభించిన అనేక ప్రాజెక్టుల గురించి వివరించారు. ఇవన్నీ ఒక గొప్ప, దివ్యమైన, సుసంపన్నమైన వారణాసిని రూపొందిస్తాయని అన్నారు. సేవాపురిని మా కల్కా దేవి నిలయంగా వర్ణించిన ఆయన.. దీనిని సందర్శించటం ఒక అదృష్టమని అన్నారు. దేవత పాదాలకు మొక్కిన ఆయన.. ప్రభుత్వం ఆలయానికి వెళ్లే భక్తులకు సౌకర్యాలను కల్పించి మా కల్కా ధామ్‌ను మరింత అందంగా, గొప్పగా తీర్చిదిద్దటం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సేవాపురి విప్లవాత్మక చరిత్ర, స్వాతంత్ర్య పోరాటంలో చేసిన కృషిని గుర్తు చేశారు. ప్రతి ఇంట్లో ఆడవారి, మగ వారి చేతుల్లో రాట్నం ఉండేదని, మహాత్మాగాంధీ దార్శనికత జీవం పోసుకున్న సేవాపురి ఇదేనని ప్రధానంగా పేర్కొన్నారు. చంద్‌పూర్-భదోహి రోడ్డు వంటి ప్రాజెక్టుల ద్వారా వారణాసిలోని నేత కార్మికులు ఇప్పుడు భదోహితో అనుసంధానమవుతున్నారన్న విషయాన్ని తెలియజేశారు. దీనివల్ల బనారసి పట్టు, భదోహి కళాకారులకు ప్రయోజనం చేకూరుతుందని అన్నారు.

ఆర్థిక పురోగతి, ప్రస్తుత ప్రపంచ పరిస్థితుల గురించి మాట్లాడుతూ.. వారణాసిని మేధావుల నగరంగా వర్ణించారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం పలు రకాల అనిశ్చితులను, అస్థిరతను ఎదుర్కొంటోందని ప్రధానంగా పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రపంచవ్యాప్తంగా దేశాలు తమ సొంత ప్రయోజనాలపై దృష్టి సారిస్తున్నాయన్నారు. భారత్ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించే మార్గంలో దూసుకెళ్తోందన్నారు. దీనివల్ల భారత తన ఆర్థిక ప్రయోజనాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. రైతులు, చిన్న పరిశ్రమల సంక్షేమం అత్యంత ముఖ్యమైందని? ఈ విషయంలో ప్రభుత్వం సాధ్యమైనంగా కృషి చేస్తోందని ప్రధానంగా పేర్కొన్నారు.

ప్రజలకు కూడా కొన్ని బాధ్యతలు ఉన్నాయని ప్రధానంగా పేర్కొంటూ.. ప్రతి ఒక్కరూ స్వదేశీ కోసం ప్రతిజ్ఞ చేయాలని మోదీ కోరారు. భారతీయుని కష్టం, కృషితో తయారైనది ఏదైనా కూడా స్వదేశీనే అని పేర్కొన్నారు. 'వోకల్ ఫర్ లోకల్' అనే మంత్రాన్ని దేశం అనుసరించాలని పిలుపునిచ్చారు. "భారత్‌లో తయారీ (మేకిన్ ఇండియా)" ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు ప్రతి ఒక్కరు ప్రతిజ్ఞ తీసుకోవాలని కోరారు. మన ఇళ్లలోకి వచ్చే ప్రతి కొత్త వస్తువు స్వదేశీ అయి ఉండాలి. ఈ బాధ్యతను ప్రతి భారతీయుడు తీసుకోవాలని తెలిపారు. ప్రతి వ్యాపారి, దుకాణదారుడు స్వదేశీ ఉత్పత్తులను మాత్రమే విక్రయిస్తానంటూ ప్రతిజ్ఞ చేయాలని.. ఇది నిజమైన దేశ సేవ అని అన్నారు. రాబోయే పండగ సమయంలో స్వదేశీ ఉత్పత్తులను ఉపయోగించాలని ప్రజలకు కోరిన ఆయన.. ఇది మహాత్మాగాంధీకి నిజమైన నివాళి అని అన్నారు.

సమష్టి కృషి ద్వారానే అభివృద్ధి చెందిన భారతదేశం అనే కల నెరవేరుతుందని ప్రధానంగా చెబుతూ తన ప్రసంగాన్ని ముగించారు. ఈరోజు ప్రారంభించిన అభివృద్ధి పనుల విషయంలో మరోసారి అభినందనలు తెలియజేశారు.

ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ యోగి ఆదిత్యనాథ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కేంద్ర మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్.. గవర్నర్‌లు, ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు, ఇతర ప్రముఖులు వర్చువల్‌గా కార్యక్రమానికి హాజరయ్యారు. వారణాసిలో సమగ్ర పట్టణాభివృద్ధి, సాంస్కృతిక పునరుజ్జీవనం, మెరుగైన అనుసంధానత, జీవన నాణ్యత పెంపుదలే లక్ష్యంగా మౌలిక సదుపాయాలు, విద్య, ఆరోగ్య సంరక్షణ, పర్యాటకం, పట్టణాభివృద్ధి, సాంస్కృతిక వారసత్వం వంటి బహుళ రంగాలకు సంబంధించిన ప్రాజెక్టులను ప్రధాని ప్రారంభించారు.



# ప్రధానమంత్రి మాతృ వందన యోజన' : ప్రత్యేక నమోదుల గడువు 15 వరకు పొడిగింపు

న్యూఢిల్లీ,ఆగష్టు 4:'ప్రధానమంత్రి మాతృ వందన యోజన' (పీఎంఎంవీవై) కింద ప్రత్యేక నమోదు గడువును మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఈ నెల 15వరకు పొడిగించింది. ఇంటింటికీ వెళ్లి అవగాహన కలిగించి, లబ్ధిదారులను చేర్పించేందుకు ప్రచార కార్యక్రమం అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తల నాయకత్వంలో కొనసాగుతోంది. అర్హత కలిగిన గర్భవతుల వద్దకు, చంటి బిడ్డలకు పాలిచ్చి సంరక్షిస్తున్న తల్లుల (పీడబ్ల్యూ-ఎల్ఎం) వద్దకు వెళ్లి వారిని సకాలంలో ఈ పథకంలో చేర్చడం ఈ స్కీము లక్ష్యం. గర్భిణులు, చంటి బిడ్డలకు పాలిచ్చే తల్లులు.. పౌష్టికాహారం తీసుకోవడానికి ఆర్థిక సహాయాన్ని ఈ పథకం అందించడంతో పాటు తగిన సూచనలను, సలహాలను కోరే వారికి మార్గదర్శనం చేసి వారి ఆరోగ్యం మెరుగైన స్థితిలో ఉండేటట్లు సాయపడుతోంది. ఆడపిల్ల పుడితే, ఆ శిశువు పట్ల సానుకూల వైఖరిని పెంపొందించే విషయంలో కూడా ఈ పథకం తోడ్పడుతోంది.

తొలిచూలు కాన్పునకు ముందూ, ప్రసవం అయిన తర్వాతా తల్లులు వేతనం నష్టపోకుండా విశ్రాంతి తీసుకొనేందుకు పాక్షిక పరిహారం రూపంలో నగదు ప్రోత్సాహకాలను పీఎంఎంవీవై అందిస్తోంది. ఈ పథకాన్ని ప్రారంభించినప్పటి నుంచి గత నెలాఖరు వరకు మాతృత్వ లబ్ధిగా (కనీసం ఒకసారి) 4.05 కోట్ల మంది మహిళలకు రూ.19,028 కోట్లను వారి బ్యాంకు ఖాతాలలోకి లేదా పోస్టాఫీస్ అకౌంట్లలోకి నేరుగా బదిలీ చేశారు. మిషన్ శక్తిలో భాగంగా ఉన్న 'సామర్థ్య' కింద కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న పథకమే ఈ 'ప్రధానమంత్రి మాతృ వందన యోజన'. ఇది ప్రత్యక్ష ప్రయోజనం బదిలీ (డీబీటీ) పద్ధతిలో ఆర్థికసాయాన్ని అందిస్తోంది. పీఎంఎంవీవైలో.. మొదటి బిడ్డ పుట్టిన వేళ రూ.5,000 నగదు ప్రోత్సాహకాన్ని ఇవ్వడంతో పాటు, రెండో కాన్పులో ఆడ పిల్ల పుడితే ప్రసవం అయిన తరువాత ఒక ఇన్‌స్టాల్‌మెంట్‌లో రూ.6,000 నగదు ప్రోత్సాహకాన్ని మిషన్ శక్తి స్కీము మార్గదర్శకాల ప్రకారం.. అందిస్తారు. గర్భవతులతో పాటు పాలిచ్చే తల్లులకు ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి మెరుగైన సూచనలు, సలహాలను ఇస్తూ దేశమంతటా తల్లీబిడ్డల ఆరోగ్యసంరక్షణకు అండగా నిలవాలనేదే ఈ పథకం ధ్యేయం. ఈ పథకాన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు తమ క్షేత్ర స్థాయి కార్యకర్తలకు ఒక కొత్త 'ప్రధానమంత్రి మాతృవందన యోజన సాఫ్ట్‌వేర్' ను సమకూర్చి, అమలుచేస్తున్నాయి. ఈ సాఫ్ట్‌వేర్‌ను 2023 మార్చి నెలలో ప్రవేశపెట్టారు. ఈ సాఫ్ట్‌వేర్ ద్వారా యూఐడీఏఐ ఆధ్వర్యంలోని 'ఆధార్' ప్రమాణీకరణను డిజిటల్ పద్ధతిలో పూర్తి చేస్తున్నారు. నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ధ్రువీకరణను కూడా పొంది నిధులను డీబీటీకి అనువైన ఆధార్‌తో లింకు ఉన్న బ్యాంకు ఖాతాలో గాని లేదా పోస్టాఫీస్ ఖాతాలో గాని నేరుగా జమ చేస్తున్నారు. ఈ పథకం కింద వివిధ సేవలు సాఫీగా లభించేలా చూడటానికి పీఎంఎంవీవై పోర్టల్‌లో అనేక సంస్కరణలను తీసుకువచ్చారు. సమీకృత ఫిర్యాదు మాడ్యూల్, అనేక భాషలలో సేవలను అందించే టోల్-ఫ్రీ పీఎంఎంవీవై హెల్ప్‌లైన్ (14408), ముఖ గుర్తింపు వ్యవస్థ (ఎఫ్ఆర్ఎన్)ను ఉపయోగించుకుంటూ 'ఆధార్' ఆధారంగా పనిచేసే బయోమెట్రిక్ ప్రమాణీకరణ, అర్హులైన లబ్ధిదారుల జాబితా వంటివి ఈ సంస్కరణలలో కొన్ని.

# ఐఎన్ఎస్ అజయ్, ఐఎన్ఎస్ నిస్తార్: రక్షణ రంగాన్ని దేశీయంగా అభివృద్ధి చేయడానికి అందిస్తున్న వ్యూహాత్మక ఉక్కు సరఫరాలో

న్యూఢిల్లీ,ఆగష్టు 4:దేశీయంగా రక్షణ రంగాన్ని అభివృద్ధి చేయడంలో ఉక్కు రంగంలో అతిపెద్ద పీఎస్‌యూ, మహారత్న సంస్థ అయిన స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (సెయిల్) కీలకపాత్ర పోషిస్తోంది. గార్డెన్ రీచ్ షిప్ బిల్డర్స్ అండ్ ఇంజినీర్స్ లిమిటెడ్ (జీఆర్ఎస్ఈ) ప్రారంభించిన ఐఎన్ఎస్ అజయ్‌కు, జులై 2025లో హిందూస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ (హెచ్ఎస్ఎల్) ప్రారంభించిన ఐఎన్ఎస్ నిస్తార్‌కు క్రిటికల్ - గ్రేడ్ ఉక్కును సెయిల్ సరఫరా చేస్తోంది.

నిర్మాణ సమగ్రత, సామర్థ్యానికి హామీ ఇస్తూ.. ఐఎన్ఎస్ అజయ్ తయారీకి అవసరమైన ప్రత్యేక డీఎంఆర్ గ్రేడ్ స్టీల్ ప్లేట్లు అన్నింటినీ సెయిల్ సరఫరా చేసింది. స్వదేశీ పరిజ్ఞానంతో జీఆర్ఎస్ఈ రూపొందించిన యాంటీ సబ్ మెరైన్ వార్‌ఫేర్ షాలో వాటర్ క్రాఫ్ట్ (ఏఎస్‌డబ్ల్యూ-ఎస్‌డబ్ల్యూసీ) సిరీస్‌లో ఐఎన్ఎస్ అజయ్ ఎనిమిదోది, చివరి యుద్ధ నౌక.

స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించి, నిర్మించిన మొదటి డైవింగ్ సపోర్ట్ వెసల్ (డీఎస్వీ) అయిన ఐఎన్ఎస్ నిస్తార్‌కు అవసరమైన ప్రత్యేక గ్రేడు ప్లేట్లు మొత్తాన్ని సెయిల్ సరఫరా చేసింది. జలాంతర్గామి రక్షణ కార్యకలాపాలు, డీప్ సీ డైవింగ్, పెట్రోలింగ్ చేపట్టడంలో హెచ్ఎస్ఎల్ రూపొందించిన ఐఎన్ఎస్ నిస్తార్ కీలకపాత్ర పోషిస్తుంది.

జాతీయ రక్షణ రంగ లక్ష్యాలు సాధించడం, ఆత్మనిర్భర భారత్‌ను నిర్మించడంలో సెయిల్ అందిస్తున్న వ్యూహాత్మక తోడ్పాటు.. రక్షణ రంగాన్ని బలోపేతం చేయడంలో ఆ సంస్థ అంకితభావాన్ని తెలియజేస్తుంది. ప్రతి టన్ను స్టీలుతో భారతీయ నౌకా వాణిజ్య సన్నద్ధతను, రక్షణ స్థిరత్వాన్ని పెంపొందించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది.

# భౌతిక దేహానికి నివాళులర్పించిన సీనియర్ నాయకులు



మహబూబాబాద్, ఆగష్టు 4:(నేటినిజం ప్రతినిధి): పెద్దవంగర మండలంలోని అవుతపురం గ్రామంలో పాము కమలమ్మ (85) వృద్ధాప్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న పాలకుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే హనుమాండ్ల యశస్విని రెడ్డి మరియు టిపిసిసి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పాలకుర్తి నియోజకవర్గం ఇంచార్జి హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి ఆదేశాల మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తోటకూరి శ్రీనివాస్ వారి నివాసనికి చేరుకొని వారి భౌతిక దేహానికి పూల మాల చేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు గద్దల స్వామి, గ్రామ పార్టీ అధ్యక్షుడు బొమ్మరబోయిన రవి, బెల్లంకొండ సాగర్, బెల్లంకొండ సంపత్ ,గ్రామ సోషల్ మీడియా కోఆర్డినేటర్ సోమాచారి తదితరులు పాల్గొనడం జరిగింది.

# పలు హాస్టల్ వార్డెన్లపై తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కు వినతి

## - టిఎస్ఎస్ఏ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దామళ్ళ సత్యం

ఖమ్మం, ఆగష్టు 4:(నేటినిజం ప్రతినిధి): సోమవారం



నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఖమ్మం డివిజన్ పరిధిలోని ట్రైబల్ వెల్ఫేర్, సంక్షేమ హాస్టల్స్ పోస్ట్ మెట్రిక్ అండ్ ప్రీమెట్రిక్ హాస్టల్లో వార్డెన్స్ అందుబాటులో ఉండటం లేదని కొన్ని హాస్టల్లో కనీసం శుభ్రత పాటించడం లేదని, మంచినీరు, టాయిలెట్స్, భోజన సమస్యలు తీవ్రంగా వేధిస్తున్నాయని ఇతర శాఖ అధికారితో విచారణ చేయించి చర్యలు తీసుకోవాలని, కొనిజర్ల బాలుర కళాశాల హాస్టల్ నుంచి విపరీతమైన దుర్వాసన వస్తుంది. దీనిని ముస్తాఫనగర్ లో నిర్వహిస్తున్నారు, ఇక్కడ మంచినీటి సమస్య, మరుగుదొడ్ల దుర్వాసన వల్ల అనారోగ్య సమస్యలకు విద్యార్థులు గురవుతున్నారని హాస్టల్ వార్డెన్ నరసింహారావు అందుబాటులో ఉండటం లేదు. మరో హాస్టల్ ఖమ్మం రూరల్ పోస్ట్ మెట్రిక్ (బి) కూడా సమస్యలకు నిలయంగా మారింది, ఇక్కడ చపాతీలను వంట పాత్ర మూతపై కాలుస్తున్నారు, విపరీతమైన మంచి నీటి సమస్య కూడా వేధిస్తుందని వార్డెన్ నక్రమంగా విధులు నిర్వహించడం లేదని ఈ డివిజన్లో పనిచేసే డివిజనల్ ఆఫీసర్ ఏటిడిఓ సత్యవతి హాస్టల్లను కనీసం తనిఖీ చేయడం లేదని నెలలో ఒకటి రెండు సార్లు కూడా ఆఫీసు తెరవడం లేదని ఈ సమస్యలపై సమగ్ర విచారణ జరిపి అధికారులపై తగు చర్యలు తీసుకోవాలని తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దామళ్ళ సత్యనారాయణ డిమాండ్ చేస్తూ కలెక్టర్ కి వినతిపత్రం ఇచ్చారు.

# సీనియర్ ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



హన్మకొండ, ఆగష్టు 4: (నేటినిజం ప్రతినిధి) రాష్ట్ర విపత్తు నిర్వహణ ప్రత్యేక కార్యదర్శి, సీనియర్ ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ ను వరంగల్ ఎన్ఐటి వద్ద హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర విపత్తు నిర్వహణ ప్రత్యేక కార్యదర్శి అరవింద్ కుమార్ కు జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మొక్కను అందించి స్వాగతం పలికారు.

# పత్తి సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి..

## రైతులకు అవగాహనలో వ్యవసాయ అధికారులు

మెదక్, ఆగష్టు 4: పత్తి పంట సాగులో రైతులు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి నరేష్ రైతులకు సూచించారు. సిద్దిపేట జిల్లా రాయపోల్ మండల పరిధిలోని చిన్నమాసాన్ పల్లి గ్రామ పరిధిలోని ప్రత్తి పంటను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం పత్తి పంటలో రసం పీల్చి పురుగుల ఆశించే అవకాశం ఉందని.. అందువల్ల పత్తి పంట వేసిన రైతులు వీటి నివారణ కోసం అసిటామిప్రిడ్ 20% ఎస్పీ 100 గ్రాములు ఎకరానికి లేదా ఫిప్రోనిల్ 400 మి.లీ ఎకరానికి, థయోమిథాక్జామ్ 25%డబ్ల్యూజీ 100 గ్రాములు ఎకరానికి, వేప నూనె 1000 మి.లీ ఎకరానికి కలిపి పిచికారి చేసి పత్తిలోని తెల్ల దోమ , పచ్చ దోమ, పెనుబంక లాంటి రసం పీల్చే పురుగులు నివారించి మంచి ఫలితం పొందవచ్చని రైతులకు అవగాహన కల్పించారు.

అదే విధంగా నానో యూరియా ప్లస్ గురించి రైతులకు వివరించటం జరిగింది. నానో యూరియా ప్లస్ పిచికారి చేయడం ద్వారా ప్రస్తుతం ఉన్న బెట్ట పరిస్థితుల నుండి పంటలను కాపాడుకోవచ్చునని.. అదే విధంగా పంటలకు కావలసిన నత్రజని కూడా మొక్కలకు లభిస్తుందని రైతులకు వివరించటం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి కవిత, రైతులు పాల్గొన్నారు.

# చదువుతోనే విజ్ఞానం, గౌరవం

## - రాష్ట్ర వయోజన విద్య డైరెక్టర్ ఉషారాణి



నల్గొండ, ఆగష్టు 4: చదువుతోనే విజ్ఞానం, గౌరవం పెంపొందుతుందని రాష్ట్ర వయోజన విద్య డైరెక్టర్ జి.ఉషారాణి అన్నారు. సోమవారం బీబీనగర్ మండలంలోని కొండమడుగు గ్రామంలో గల జిల్లా పరిషత్ పాఠశాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు విద్యార్థుల అభ్యాస ప్రక్రియను మెరుగు పరిచేందుకు కృషి చేయాలని సూచించారు.

విద్యార్థుల లోపాలను సరిచేస్తూ చదువులో రాణించేలా శిక్షణ ఇవ్వాలన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థులతో ఆమె మాట్లాడారు.

ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి సురేశ్ రెడ్డి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి పాల్గొన్నారు.

# గ్రామీణ విద్యార్థులకు సాంకేతిక విద్య అందించడమే 'కిట్స్' లక్ష్యం : ప్రిన్సిపాల్ గాంధీ



నల్గొండ, ఆగష్టు4: గ్రామీణ విద్యార్థులకు సాంకేతిక విద్యను అందించి, ఉద్యోగ అవకాశాలు కల్పించడమే కిట్స్ మహిళా ఇంజినీరింగ్ కళాశాల లక్ష్యమని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పెరుమాళ్ల గాంధీ అన్నారు. సోమవారం పాలిటెక్నిక్ డిప్లొమా ప్రథమ సంవత్సరం విద్యార్థినిలకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కళాశాలలో ఉన్న మెరుగైన సదుపాయాలను విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. డైరెక్టర్ నాగార్జునరావు మాట్లాడుతూ.. విద్యార్థినులు తొలి సంవత్సర నుండి చదువుతో పాటు, ఇతర నైపుణ్యాల పెంపుపై దృష్టి సారించాలన్నారు.

అర్హత, అనుభవం ఉన్న అధ్యాపకులతో బోధన చేయిస్తున్నట్లు తెలిపారు. అత్యాధునిక లేబరేటరీతో పాటు డిజిటల్ లైబ్రరీ కూడా ఏర్పాటు చేసినట్లు, విద్యార్థినులు ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా సౌత్ ఇండియా కరాటే ఛాంపియన్‌షిప్‌లో బంగారు పతకం సాధించిన విద్యార్థిని బ్లెస్సిని కళాశాల చైర్మన్ నీరజ సత్యనారాయణ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు రమేశ్, స్రవంతి, జనార్ధన్, శివాజీ, వెంకట్రామిరెడ్డి, ఎజాజ్, మాధవి, విద్యార్థినిల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# కారు నడుపుతూ సైక్లిస్టును ఢీకొట్టిన బాలుడు.. కేసు నమోదు చేసిన పోలీసులు

హైదరాబాద్, ఆగష్టు 4:13ఏళ్ల బాలుడు కారు నడుపుతూ సైకిల్ మీద వెళ్తున్న వృద్ధుడిని ఢీకొట్టిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మల్లేపల్లి సమీపంలోని మాంగార్‌బస్తీలో నివాసం ఉండే ఎండీ.షమీమ్(70) సైకిల్ మీద కూరగాయలు అమ్ముకుంటూ జీవిస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఉదయం ఇంటినుంచి బయలుదేరి మాసాబ్‌ట్యాంక్ మీదుగా బంజారాహిల్స్ రోడ్ నెం 1లో వెళుతున్నాడు. బంజారాహిల్స్ రోడ్ నెం 11లోని సర్వీ హోటల్‌కు సమీపంలోకి రాగానే వెనకనుంచి వచ్చిన ఓ స్విఫ్ట్ కారు (టీజీ08సీ6385) అతడిని ఢీకొట్టింది. ఈ ఘటనలో కిందపడిపోయిన షమీమ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం సమయంలో కారును 13ఏళ్ల బాలుడు నడిపిస్తున్నట్లు గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు బాధితుడి ఫిర్యాదుతో బాలుడితో పాటు అతడికి కారు ఇచ్చిన వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# కార్పొరేట్ శక్తులకు ఆదివాసీ, గిరిజనుల ఖనిజ సంపదను కట్టబెడుతున్న కేంద్రం





హైదరాబాద్, ఆగష్టు 4: దేశంలోని ఆదివాసీ, గిరిజనుల ఖనిజా సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పనంగా కేంద్ర ప్రభుత్వం కట్టబెడుతోందని తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.అంజయ్య నాయక్ ఆరోపించారు. సోమవారం హిమాయత్ నగర్‌లో సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీలు, గిరిజనుల సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఆరోపించారు.

ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్రం అమాయక ఆదివాసీలను అంతం చేస్తుందని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనులకు ఇచ్చిన హామీలను అమలు చేసి, పెండింగ్‌లో ఉన్న రూ.216 కోట్లు ట్రైకార్ రుణాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 9న జరిగే ప్రపంచ ఆదివాసీ గిరజన దినోత్సవంను ఘనంగా నిర్వహించాలని పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో నేతలు వల్లా నర్సింహరెడ్డి, రమేష్, కుటుంబరావు, ఆర్.శంకర్ నాయక్, స్వరూప నాయక్ పాల్గొన్నారు.

# నవజాత శిశువులకు తల్లిపాలే శ్రేష్టం

## -ఎయిమ్స్ డిప్యూటీ డైరెక్టర్ బిపిన్ వర్గీస్

హైదరాబాద్, ఆగష్టు 4:నవజాత శిశువులకు తల్లిపాలే శ్రేష్టమని ఎయిమ్స్ డిప్యూటీ డైరెక్టర్ బివిన్ వర్గీస్, మెడికల్ సూపరింటెండెంట్ అభిషేక్ అరోరా అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సోమవారం బీబీనగర్ ఎయిమ్స్ లో 60 మంది నర్సింగ్ అధికారులకు తల్లిపాల ప్రాముఖ్యతపై వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తల్లీబిడ్డల శ్రేయస్సుకు తల్లిపాల వినియోగం ఎంత అవసరమో వివరించారు. పుట్టిన బిడ్డకు మొదటి గంటలోనే తల్లిపాలు పట్టించాలన్నారు. మొదటి ఆరు నెలలు శిశువుకు తల్లిపాలు శ్రేష్టమన్నారు. డబ్బాపాలు వద్దు తల్లిపాలు ముద్దు అనే నినాదంతో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ డీన్ నితిన్ అశోక్ జాన్ పాల్గొన్నారు.

# పండుగ సాయన్న జయంతిని అధికారికంగా నిర్వహించాలి : పిట్టల అశోక్

హైదరాబాద్, ఆగష్టు 4:బహుజన వీరుడు పండుగ సాయన్న జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని తెలంగాణ మహాసభ జిల్లా అధ్యక్షుడు పిట్టల అశోక్ అన్నారు. ఆగష్టు 8వ తేదీన పండుగ సాయన్న జయంతిని పురస్కరించుకుని ముదిరాజ్ సంఘం బీబీనగర్ మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాటం సాగించిన బహుజన వీరుడు పండుగ సాయన్న జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పండుగ సాయన్న కేవలం భౌతిక దోపిడీకి వ్యతిరేకంగా మాత్రమే కాకుండా, సామాజిక న్యాయం కోసం, రాజ్యాధికారంలో బీసీలకు న్యాయమైన వాటా కోసం పోరాటం సాగించినట్లు తెలిపారు.

సాయన్న వారసత్వాన్ని కేవలం జయంతి నాడు గౌరవించడంలో కాదు ఆయన కలలను నిజం చేసే దిశగా బీసీలు, బహుజనులు రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలన్నారు. బీసీలు తమ సామాజిక, రాజకీయ, ఆర్థిక హక్కుల కోసం సంఘటితమవాలని, రాజకీయ తలంపుల కోసం కాకుండా, సామాజిక న్యాయ సాధన కోసం పండుగ సాయన్న జయంతిని ఆగస్ట్ 8న గ్రామ గ్రామాన ఘనంగా జరుపుకోవాలనీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కనకబోయిన గోపాల్, కొర్ని పాండు, ఆరుముల్ల జహంగీర్, బోయిన కృష్ణ, సార నరసింహ, గుండెగల్ల అశోక్, ఎర్రోళ్ల బాలరాజు పాల్గొన్నారు.

# బాపట్ల జిల్లా బల్లికురవలో ఘోర ప్రమాదం

## -గ్రానైట్ క్వారీలో బండరాళ్లు మీద పడడంతో ఆరుగురు కార్మికులు దుర్మరణం
## -పదిమందికి తీవ్రగాయాలు.. నలుగురి పరిస్థితి ఆందోళనకరం



బాపట్ల ఆగష్టు 4 (ఎక్స్ ప్రెస్ న్యూస్);బాపట్ల జిల్లా బల్లికురవలో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. గ్రానైట్ క్వారీలో బండరాళ్లు మీద పడడంతో ఆరుగురు కార్మికులు దుర్మరణం చెందారు. ఇప్పటివరకు నాలుగు మృతదేహాలు వెలికితీశారు. బండరాళ్ల కింద చిక్కుకున్న మరో ఇద్దరి మృతదేహాలను బయటకు తీసేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ప్రమాదం జరిగిన సమయంలో క్వారీలో 16 మంది కార్మి కులు పనిచేస్తున్నారు. ఘటనలో తీవ్రంగా గాయపడిన మరో 10 మంది కార్మికులను మెరుగైన వైద్యం నిమిత్తం నరసరావుపేట ఆసుపత్రికి తరలించారు. వారిలో నలుగురి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. క్వారీ యాజమాన్యం భద్రతా చర్యలు చేపట్టలేదని అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. పదహారు మంది కార్మికులు క్వారీలో పని చేస్తుండగా అకస్మాత్తుగా బండరాళ్లు కిందపడ్డాయని ప్రత్యక్ష సాక్షులు వెల్లడించారు. దీంతో ఆరుగురు కార్మికులు రాళ్ల కింద పడి నలిగిపోయారని వివరించారు. చనిపోయిన వారంతా ఒడిశాకు చెందిన వారని అధికారులు తెలిపారు. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, రెస్క్యూ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ సంఘటనపై ఆందోళన వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబునాయుడు అధికారుల నుండి వివరణాత్మక నివేదికను కోరారు. గాయపడిన వారికి నాణ్యమైన వైద్య సంరక్షణ అందించాలని ఆదేశించారు. ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర దర్యాప్తు జరపాలన్నారు. క్వారీ కూలి ప్రాణనష్టం తనను తీవ్రంగా కలచివేస్తుందని మంత్రి నారా లోకేష్ అన్నారు. 'ప్రభుత్వం మృతుల కుటుంబాలకు అండగా నిలుస్తుంది' అని ఆయన తన సంతాపాన్ని వ్యక్తం చేస్తూ, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాను. మంత్రులు అనగాని సత్య ప్రసాద్, గొట్టిపాటి రవి కుమార్ ఈ సంఘటనపై విచారం వ్యక్తం చేశారు. బాధితులకు ఉత్తమ వైద్య సంరక్షణ అందించాలని అధికారులను కోరారు. కలెక్టర్ మురళి సమగ్ర దర్యాప్తునకు ఆదేశించారు. రక్షణ, సహాయ చర్యలను పర్యవేక్షించాలని ఉమ్మడి, డివిజన్ స్థాయి అధికారులను ఆదేశించారు.

# డీఎస్ఆర్ యాప్‌లో నకిలీ ముఖ గుర్తింపు హాజరు

## -ఇద్దరు పంచాయతీ కార్యదర్శులను సస్పెన్షన్ చేసిన జిల్లా కలెక్టర్

అచ్చంపేట ఆగష్టు 4 (ఎక్స్ ప్రెస్ న్యూస్); : నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలానికి చెందిన ఇద్దరు పంచాయతీ కార్యదర్శులను జిల్లా కలెక్టర్ సంతోష్ సస్పెన్షన్ చేశారు. మండలంలోని అంకిరోనిపల్లి గ్రామానికి చెందిన పంచాయతీ కార్యదర్శి బి కల్పన , అక్కరం పంచాయతీలో ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న రత్లావత్ మక్తలాల్ ను విధుల నుంచి తొలగిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. జూలై నెల డీఎస్ఆర్ యాప్‌లో నకిలీ ముఖ గుర్తింపు హాజరు ఇచ్చారని గుర్తించడంతో వారిద్దరిపై కలెక్టర్ చర్యలు తీసుకున్నారు. ఉద్దేశపూర్వకంగా ఉన్నతాధికారులను తప్పుదారి పట్టించినందుకు చర్యలు తీసుకున్నారు

# సమాజంలో సగభాగం బిసిలు ఉన్నారు..

## వాళ్లకు రాజకీయంగా సగ భాగం దక్కాలి: ఎంఎల్‌సి కవిత



హైదరాబాద్ ఆగష్టు 4 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: సమాజంలో సగభాగం బిసిలు ఉన్నారని, వాళ్లకు రాజకీయంగా సగ భాగం దక్కాలని ఎంఎల్‌సి కవిత తెలిపారు. తెలంగాణ జాగృతి ఇవాళ చేసే పోరాటం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. 42 శాతం బిసి రిజర్వేషన్ల సాధన కోసం ఎంఎల్‌సి కవిత ధర్నా చౌక్ వద్ద 72 గంటల నిరాహార దీక్ష చేపట్టారు.

బిఆర్ అంబేడ్కర్, జ్యోతిరావు పూలే, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాలకు ఆమె నివాళులర్పించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. కామారెడ్డి డిక్లరేషన్ చెప్పినట్టుగా బిసిలకు న్యాయం చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణలో ప్రతి ఒక్కరికీ రాజ్యాధికారంలో వాటా కావాలని, ఆర్థిక అవకాశాలు రావాలన్నారు.

స్థానిక ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కావాలని కోరారు. కానీ తెలంగాణ ప్రభుత్వం బిజెపిపై నెపం నెట్టి తప్పించుకోవాలని చూస్తోందని కవిత దుయ్యబట్టారు. ముస్లింలకు పది శాతం రిజర్వేషన్లు ప్రత్యేకంగా పార్లమెంటులో బిల్లు పెట్టాలని కవిత డిమాండ్ చేశారు.

# సనాతన బానిసత్వాన్ని అంతం చేయగల ఏకైక ఆయుధం విద్య మాత్రమే

## – ప్రముఖ నటుడు రాజ్యసభ సభ్యుడు కమల్ హాసన్

చెన్నయ్ ఆగష్టు 4 (ఎక్స్ ప్రెస్ న్యూస్);నియంతృత్వాన్ని, సనాతన బానిసత్వాన్ని అంతం చేయగల ఏకైక ఆయుధం విద్య మాత్రమేనని ప్రముఖ నటుడు, మక్కల్ నీది మైయమ్ పార్టీ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు కమల్ హాసన్ అన్నారు. సినీ నటుడు సూర్య కు ఎడ్యుకేషన్ చారిటీ అయిన అగరం ఫౌండేషన్ ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.ప్రజలు మరే ఆయుధాన్ని చేతిలోకి తీసుకోకుండా కేవలం విద్యను మాత్రమే గట్టిగా పట్టుకోవాలని కమల్ హాసన్ సూచించారు. విద్య లేకుండా మనం గెలవలేమని, బహుసంఖ్యాక మూర్ఖులు (మూదర్గల్) మనలను ఓడించగలరని వ్యాఖ్యానించారు. అందుకే మనం విద్యను గట్టిగా పట్టుకోవాలని అన్నారు. విద్యా వ్యవస్థలు, సామాజిక సాధికారతపై ప్రభుత్వం పెట్టుబడులు పెట్టాల్సిన అవసరాన్ని ఆయన గుర్తుచేశారు.ఇక 2017 నుంచి అమల్లో ఉన్న 'నీట్' విధానాన్ని కమల్ హాసన్ తీవ్రంగా విమర్శించారు. ఇది ఆర్థికంగా వెనుకబడిన, అణగారిన వర్గాల విద్యార్థుల వైద్య విద్య కలలను నాశనం చేసిందని ఆవేదన వ్యక్తంచేశారు. సామాజిక సేవ అనేది ఒక ముళ్ల కిరీటమని అన్నారు. సినిమాలో మంచి నటనకు కిరీటం లభిస్తుందని, సామాజిక సేవకు మాత్రం ముళ్ల కిరీటం లభిస్తుందని వ్యాఖ్యానించారు.ఆ ముళ్ల కిరీటాన్ని ధరించడానికి బలమైన హృదయం కావాలని కమల్ హాసన్ అన్నారు. సామాజిక సేవను ఎవరూ మన కోసం చేయరని, మనమే చేయాలని సూచించారు. నాయకత్వం అంటే ఒక స్థానంలో కూర్చుని పాలించడం కాదని, సమాజంలో కనిపించకుండా సేవ చేయడమని కమల్ హాసన్ అన్నారు.

# ఇంటి ముంగిట్లో కే మందు సీసాలు ...

## -రుణమాఫీ సొమ్ముకు 'బారు' వడ్డీ వసూలు ..
## -మహా నగరానికి వెలుపలి పట్టణాల్లోనూ.. మైక్రో బ్రూవరీలకు ప్రభుత్వం కసరత్తు
## -అమ్మకాలు తగ్గితే పల్లెలకూ విస్తరింపు

హైదరాబాద్ ఆగష్టు4 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );నెల రోజుల కిందటి రైతు భరోసా, అంతకు ముందు ఇచ్చిన రుణమాఫీ సొమ్ముకు 'బారు' వడ్డీ, దాని జేజమ్మ వడ్డీతో కలిపి లాక్కునేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మందు సీసాలను ముందు పెట్టింది. హైదరాబాద్ మహానగరం అవతల ఉన్న కార్పొరేషన్లలో ఇన్‌స్టంట్ బీరు కేఫ్‌లు, మండలం, గ్రామమనే తారతమ్యం లేకుండా ఎక్కడ సరుకు అమ్ముడుపోతే అక్కడికే మద్యం దుకాణం మార్చుకునే విధంగా ఎక్సైజ్ నిబంధనలు సవరించారు. ఈమేరకు నూతన ఎక్సైజ్ పాలసీ రూపొందించారు. తొమ్మిది రోజుల్లో రూ .9 వేల కోట్ల రైతు భరోసా ఇచ్చామని గొప్పలకు పోయిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సరిగ్గా నెల తిరక్క ముందే 15 రోజుల్లో రూ. 15 వేల కోట్లు జనం దగ్గర నుంచి గుంజుకునే లిక్కర్ పాలసీ అమల్లోకి తెస్తున్నది. ఇది చుక్క మద్యం కూడా అమ్మకుండానే పిండుకునే రాబడి. పల్లె, పట్టణ జనాలను తాగుబోతులుగా మార్చి గల్లా పెట్టెను ఫుల్లుగా నింపడం ద్వారా నెలకు రూ. 4,500 కోట్లు ఆర్జించే వ్యాపార పథకం మరోటి ఉన్నది.

కొత్త నిబంధనలు

మద్యం దుకాణదారుల నుంచి లెవీ స్పెషల్ రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్‌ను ఏడాదికి రూ.5 లక్షల చొప్పున ఒకే వాయిదాలో వసూలు చేస్తారు. లైసెన్సుదారులు మూడేండ్ల ఎక్సైజ్ ఫీజులో ఒక ఏడాది లైసెన్స్ ఫీజు ముందే డిపాజిట్ చేయాలి. మిగిలిన ఫీజులో ఎనిమిదో వంతుకు సమానమైన రెండు ఫిక్స్‌డ్ డిపాజిట్లు లేదా బ్యాంకు గ్యారెంటీలు ఇవ్వాలి. ఎక్సైజ్ కమిషనర్ నిబంధనల మేరకు దుకాణాల్లో రోజువారీ లావాదేవీలు నమోదు చేసుకొనే వ్యవస్థ అవసరం. అన్ని షాపుల్లో మూడు సీసీటీవీ కెమెరాలు తప్పనిసరిగా ఉండాలి. వీటిని ఎక్సైజ్ శాఖ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానించాలి. లిక్కర్ షాపుల వద్ద తగిన పార్కింగ్ సౌకర్యం తప్పనిసరి. గానీ నూతన ఎక్సైజ్ పాలసీతో మద్యం దుకాణాలు, మైక్రో బ్రూవరీల లైసెన్స్‌లకు నోటిఫికేషన్ వెలువడనున్నట్టు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. 15 రోజుల్లో లైసెన్సీల నిర్ధారణ, దుకాణాల కేటాయింపులు పూర్తి అవుతాయని ఆ శాఖ అధికారులు చెప్తున్నారు.

11 పర్యాయాలకు ప్రివిలేజ్ ఫీజు

2011 జనాభా గణన ప్రాతిపదికనే రాష్ట్ర ప్రభుత్వం లైసెన్స్ దుఖాణాలు ఖరారు చేసింది. అయితే ప్రస్తుతం రెండేళ్ల మాత్రమే ఏ4 దుకాణాల లైసెన్స్ గడువును మూడేండ్లకు సవరించారు. దరఖాస్తు ఫారం ధర భారీగా పెంచారు. గతంలో రూ. 2 లక్షల ఉన్న ఫారం ధర ఇప్పుడు రూ. 3 లక్షలు చేశారు. అయితే లైసెన్స్ గడువు మూడేళ్లకు పెంచిన నేపథ్యంలో ఒక ఏడాది లైసెన్స్ ఫీజు అడ్వాన్స్‌గా తీసుకోవాలని నిర్ణయించారు. అయితే ఈనిబంధనపై మద్యం వ్యాపారుల నుంచి పెద్ద ఎత్తున వ్యతిరేకత వ్యక్తం అవుతున్నది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కొంత సందిగ్ధంలో పడ్డట్టు సమాచారం.

ఇప్పటి వరకు 10 పర్యాయాలు మాత్రమే ఉన్న ఎక్సైజ్ ప్రివిలేజ్ ఫీజును 11 పర్యాయాలకు పెంచారు(దుకాణ లైసెన్స్ ఫీజు మీద 11 సార్లు మద్యం విక్రయిస్తే దుకాణదారుడికి ఇచ్చే రిటైలర్ మార్జిన్‌లో ఎలాంటి మార్పు లేకుండా). ఇది కొంత మద్యం దుకాణదారులకు ఊరట కలిగించే అంశమే. ఈ ఆప్షన్‌తో వ్యాపారులు ఏడాది లైసెన్స్ ఫీజు అడ్వాన్స్ పెట్టడానికి ఇబ్బంది పడక పోవచ్చని ఎక్సైజ్ అధికారులు సీఎంకు వివరించినట్టు తెలిసింది.

అలాగే రిటైల్ మార్జిన్ ఆర్డినరీ బ్రాండ్ల పైన 27 శాతం, మీడియం, ప్రీమియం బ్రాండ్ల పైన 20 శాతం, బీర్లపై 20 శాతంగా గతంలో ఉన్నట్టు గానే ఖరారు చేశారు. నూతన ఎక్సైజ్ పాలసీ ఈ ఏడాది డిసెంబర్ 1 నుంచి అమల్లోకి వస్తుంది. 2028 నవంబర్ 30న ముగుస్తుంది. గతంలో ఆరు స్లాబ్‌లుగా ఉన్న మద్యం దుకాణాలను యథాతథంగా ఉంచారు. లాటరీ విధానం ద్వారా మద్యం షాపుల ఎంపిక ఉంటుంది. 10 శాతం షిఫ్టింగ్ ఫీజుతో మద్యం దుకాణాలను స్లాబ్ నిబంధనకు లోబడి రాష్ట్రంలోని ఏ ప్రాంతానికైనా మార్చుకునే వెసులుబాటు కల్పించారు.

ఇన్‌స్టంట్ కాఫీ షాపుల తరహాలో రాష్ట్రంలో ఇన్‌స్టంట్ బీర్ కేఫ్‌లు తెస్తున్నారు. ఇది కూడా ఒక రకంగా ఇన్‌స్టంట్ కాఫీ షాప్ లాంటిదే! కాకపోతే ఇకడ కాఫీ బదులు బీరు వస్తుంది. ప్రస్తుతం ఇవి హైదరాబాద్‌కు మాత్రమే పరిమితమై ఉన్నాయి. బార్, పబ్బు ఉన్న వారికి మాత్రమే వాటిని అనుబంధంగా మైక్రో బ్రూవరీలకు అనుమతించే వారు. ఇప్పుడు వీటిని రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించటానికి ఎక్సైజ్ నిబంధనల్లో క్యాబినెట్ సరవణలు చేశారు.నివాస ప్రాంతాల్లో 1,000 లీటర్ల ఫ్రెష్ బీర్‌ను ఉత్పత్తి చేయగలిగి, విక్రయించే సామర్థ్యం ఉన్న చోట మైక్రోబ్రూవరీలను అనుమతించే విధంగా ఎక్సైజ్ నిబంధనలు సవరించారు. నగరంలో ప్రతి 5 కిలోమీటర్ల దూరంలో, మహానగరానికి ఆవల ఉన్న అన్ని కార్పొరేషన్లలో కూడా మైక్రోబ్రూవరీల ఏర్పాటుకు అనుమతించే పాలసీ తెచ్చారు. ఈ ఏడాది ఒక్క హైదరాబాద్‌లోనే కనీసం 100 మైక్రో బ్రూవరీలనైనా ఏర్పాటు చేసే దిశగా ఔత్సాహిక వ్యాపారులను ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఎక్సైజ్ శాఖను నిర్దేశించినట్టు తెలిసింది. మైక్రో బ్రూవరీల లైసెన్స్ ఫీజు రూ.5 లక్షలకు పెంచారు. వినియోగించే ప్రతి లీటర్ బీరుకు రూ. 48 చొప్పున ఎక్సైజ్ డ్యూటీ ఫీజు నిర్ధారించారు. ఔత్సాహిక వ్యాపారులు కోరితే పబ్బు, క్లబ్బు, బారుకు అనుసంధాన పరిమితులు ఏవీ లేకుండా వ్యక్తిగతంగా ఇవ్వాలని నిర్ణయించారు. మైక్రో బ్రూవరీ మిషినరీ కొనుగోలు సామర్థ్యం లేనివారికి స్థానిక బ్రూవరీల నుంచి ఫ్రెష్ బీరు తెచ్చుకునే వెసులుబాటు కల్పించారు. తెలంగాణలో ప్రతి 13 వేల మందికి ఒకటి చొప్పున కేఫ్ ఏర్పాటు చేసే విధంగా ఎక్సైజ్ నిబంధనలను సవరించింది.

# AISSMC ప్రీమియర్ లీగ్ అండర్ 16 ు20 టోర్నమెంట్

హైదరాబాద్, ఆగష్టు 4 (ఎక్స్ ప్రెస్ న్యూస్;)ఆల్ ఇండియా స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ మైనారిటీస్ కమిటీ సిల్వర్ జూబ్లీ వేడుకలకు సంబంధించి, యువత మరియు విద్యార్థులలో క్రీడలను ప్రోత్సహించే లక్ష్యంతో 16 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న బాలుర కోసం ఒఋఓఓఎఅ ప్రీమియర్ లీగ్ ు20 బాలుర అండర్ 16 అనే క్రికెట్ టోర్నమెంట్‌ను త్వరలో హైదరాబాద్ సమీపంలోని మొయినాబాద్‌లో నిర్వహిస్తున్నట్లు కమిటీ చైర్మన్ శ్రీ వా.జి. సయీద్ తెలిపారు. ఇందులో పాల్గొనడం ఉచితం మరియు ఎటువంటి రుసుము వసూలు చేయబడదు., ఆటగాళ్లను వారి ప్రదర్శన ఆధారంగా ఎంపిక చేస్తామని మరియు పన్నెండు జట్లు ఏర్పడతాయని పేర్కొన్నారు. ప్రతి జట్టు మూడు మ్యాచ్‌లు ఆడుతుంది. జట్టులో పన్నెండు మంది ఆటగాళ్ళు ఉంటారు. కమిటీ నిర్ణయం తుదిది మరియు ఎటువంటి సిఫార్సులు అంగీకరించబడవు. ఈ టోర్నమెంట్ ఉద్దేశ్యం తెలంగాణ మరియు హైదరాబాద్ నుండి ఆటగాళ్లను ఒకే వేదికపైకి తీసుకురావడం మరియు వారికి గుర్తింపు ఇవ్వడం. వారి ప్రదర్శన ఆధారంగా, ఎంపికైన ఆటగాళ్లను జిల్లా మరియు రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌లకు పంపుతారు. వివరాల కోసం, మీ పేరు, ఫోటో, ఆధార్ కార్డు, కాపీని వాట్సాప్ ద్వారా 9849932346 కు పంపండి లేదా aissimc@gmail.com కు ఇమెయిల్ చేయండి. టోర్నమెంట్ తేదీలు మరియు స్థానం గురించి మీకు వాట్సాప్ ద్వారా తెలియజేయబడుతుంది. ప్రయాణం, వసతి మరియు భోజన ఏర్పాట్లు ఆటగాళ్ళు లేదా వారి సంరక్షకులు స్వయంగా నిర్వహించాల్సి ఉంటుంది.

# వసతి గృహాలలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన కామన్ మెనూ అమలుకావడం లేదు

## –తెలంగాణ రాష్ట్ర ఈబిసి సంఘం అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి



హైదరాబాద్ ఆగష్టు 4 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ప్రభుత్వం ప్రవేశపెట్టిన కామన్ మెనూ ఉమ్మడి రంగారెడ్డి మహబూబ్నగర్ నల్లగొండ నిజాంబాద్ మెదక్ వంటి జిల్లాలలో ఏమాత్రం అమలు కావడం లేదని తెలంగాణ రాష్ట్ర ఈబిసి సంఘం అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. వవ మేరకు రాష్ట్ర బిసి సంక్షేమ శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్ ను కలిసి వినతి పత్రం సమర్పించారు. తమ సంగం సభ్యుల బృందం స్వయంగా వసతి గృహాలను సందర్శించి విద్యార్థులతో మమేకమై మెనూ అమలు తీరును తెలుసుకున్నట్లు తెలిపారు. పిల్లలకు రోజువారి మెనూ అమలులో పూర్తిగా వైఫల్యం చెందిందని మంత్రికి చెప్పడం జరిగిందని తెలిపారు. జిల్లా సంబంధిత సంక్షేమ అధికారులకు దృష్టికి తీసుకు వెళ్లిన కనీసం స్పందించడం లేదని మంత్రికి వినతిపత్రం ద్వారా తెలియపరచడం జరిగిందన్నారు.మెనూ అమలు తీరు పరిశీలించడానికి సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి అధ్యక్షతన మాజీ డిజిపి పర్యవేక్షణ లో ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని కోరడం జరిగింది బీసీ సంక్షేమ జిల్లా అధికారులు కొంతమంది మెనూ అమలయితలేదని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లితే ఆ సంబంధిత అధికారులను చరవాణి ద్వారా సంప్రదించిన ఆ కలెక్టర్లని తప్పుడు పట్టించిన దాఖలాలు ఉన్నాయని పేర్కొన్నారు. అంటే పరిస్థితి ఎంతవరకు ఉందో గమనించాలని మంత్రి గారికి చెప్పడం జరిగింది సమస్య ను పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇవ్వడం జరిగిందని ప్రభాకర్ రెడ్డి తెలిపారు.మంత్రి ని కలిసిన వారిలో రాజు, రమేష్, యశ్వంత్, తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 19వ తేదీ నుంచి ఫార్మ్‌డీ కోర్సుల పరీక్షలు

హైదరాబాద్ ఆగష్టు 4 (ఎక్స్ ప్రెన్ న్యూాన్ ); ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఫార్మ్‌డీ కోర్సుల పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆరేళ్ల ఫార్మ్‌డీ మొదటి, రెండు, మూడు, నాలుగు, అయిదో సంవత్సరం మెయిన్, బ్యాక్‌లాగ్, మూడేళ్ల ఫార్మ్‌డీ మొదటి, రెండో సంవత్సరం మెయిన్ బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈ నెల 19వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

# రెడ్ క్రాస్ సొసైటీకి విశేష సేవలు అందించిన సర్వే అధికారికి హైదరాబాద్ జిల్లా యంత్రాంగం ప్రశంసలు




హైదరాబాద్, ఆగస్టు 4, (ఎక్స్ ప్రెస్ న్యూస్); హైదరాబాద్ జిల్లా కలెక్టర్ శ్రీమతి హరిచందన దాసరి ఆదేశాల మేరకు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీహైదరాబాద్ జిల్లా శాఖకు విశేష కృషి చేసినందుకు గాను జిల్లా సర్వే మరియు భూ రికార్డుల అధికారి . వులుగుండ శ్రీరామ్ ని సోమవారం సన్మానించారు.

కలెక్టర్ ఆదేశాల మేరకు, . శ్రీరామ్ కోసం 10 మంది పాట్రన్(మహా రాజా పోషకులు) సభ్యత్వాలు, 4 మంది వైస్-పాట్రన్ సభ్యత్వాలు మరియు 7 జీవితకాల సభ్యత్వాలను నమోదు చేయించి, జిల్లా అధికారులందరిలోనూ ఈ ఘనత సాధించిన మొదటి వ్యక్తిగా నిలిచారు. అంతేకాకుండా, ఆయన జూలై 23, 2025న విజయవంతంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించి, సామాజిక సంక్షేమం పట్ల తన నిబద్ధతను చాటుకున్నారు.సన్మాన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి శ్రీరామ్ చొరవను ప్రశంసించారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని అధికారులు అందరూ కూడా ఎఖీఅూ కు హైదరాబాద్ లో గవర్నర్ నిర్దేశించిన 3000 సభ్యత్వాల లక్ష్యాన్ని పూర్తి చేయాలని, ఈ విషయంలో హైదరాబాద్ జిల్లాను రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలపాలని కోరారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఛైర్మన్ . మామిడి భీమ్ రెడ్డి , జిల్లా జాయింట్ కలెక్టర్ , ఆఖీూ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.ఈ చొరవ హైదరాబాద్ జిల్లా యంత్రాంగం సమాజ సంక్షేమం పట్ల నిబద్ధతను మరియు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ యొక్క గొప్ప కార్యకలాపాలకు దాని బలమైన మద్దతును తెలియజేస్తుంది.

# సికింద్రాబాద్‌లో నేడు వీసిఐ కార్యసిద్ధి హోమం

## -వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఇరుకుల రామకృష్ణ

హైదరాబాద్ ఆగస్టు 4 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ (విసిఐ) ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 8 గంటలకు సికింద్రాబాద్ కార్ఖానా లోని విసిఐ కార్యాలయం ఆవరణలో కార్యసిద్ధి నరసింహ సహిత చండీ హోమం నిర్వహిస్తున్నట్లు సంఘం అంతర్జాతీయ అధ్యక్షుడు ఇరుకుల రామకృష్ణ తెలిపారు. శృంగేరి శారదా పీఠం ఆస్థాన పండితులు డాక్టర్ బాచంపల్లి సంతోష్ కుమార్ శాస్త్రి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పవిత్ర వైదిక కర్మ లో పాల్గొని, దైవిక ఆశీర్వాదం పొంది, విజయోన్ముఖులు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు వ్యక్తిగత, వృత్తి, వ్యాపార ,సేవా రంగాలలో మనందరి విజయాలను ఆకాంక్షిస్తూ ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇరుకుల రామకృష్ణ వివరించారు . ఈ మేరకు ఆయనతో పాటు ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ సిద్ధ సూర్య ప్రకాష్ రావు, పరిపాలన విభాగం అంతర్జాతీయ కార్యదర్శి గార్లపాటి శ్రీనివాసులు, సేవా కార్యక్రమాల అంతర్జాతీయ కార్యదర్శి బోడ సూర్య ప్రకాష్, అంతర్జాతీయ కోశాధికారి సుజాత రమేష్ బాబు ఒక ప్రకటనలో ఈ మేరకు తెలిపారు.

# బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుపై బిజెపి పూర్తి మద్దతు

## -తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి బిసి రిజర్వేషన్లు ఇవ్వడం ఇష్టం లేదు
## - బిసిలకు 42 శాతం బిల్లు పెట్టినప్పుడు ముస్లింలకు 10 శాతం ఇస్తామని చెప్పలేదు
## -ఢిల్లీలో కాంగ్రెస్ ధర్నాపై బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు ఆగ్రహం



హైదరాబాద్ ఆగష్టు 4 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి బిసి రిజర్వేషన్లు ఇవ్వడం ఇష్టం లేదని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు తెలిపారు. ఢిల్లీలో కాంగ్రెస్ ధర్నాపై రామచందర్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

బిసిలకు 42 శాతం బిల్లు పెట్టినప్పుడు ముస్లింలకు 10 శాతం ఇస్తామని చెప్పలేదని అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ భవన్ లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. హైదరాబాద్ లో చేసినట్లే ఢిల్లీకి వెళ్లి నాటకాలు చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ కు చిత్తశుద్ధి ఉంటే బిసిలకే 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని చెప్పాలని డిమాండ్ చేశారు.బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామంటే బిజెపి పూర్తి మద్దతిస్తుందని తెలియజేశారు. ముస్లింలకు 10 శాతం ఇస్తే, పదిశాతం బిసిలకు అన్యాయం జరుగుతుందని ఆవేదనను వ్యక్తం చేశారు. బిజెపి అడ్డుకుంటోందని ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ ను బిసిలు నమ్మరని అన్నారు. ప్రభుత్వానికి స్థానిక సంస్థల ఎన్నికలు పెట్టే ఉద్దేశం లేదని, స్థానిక ఎన్నికలు నిర్వహిస్తే పాత రిజర్వేషన్లే కొనసాగించాలనేది ఉద్దేశం అని రామచందర్ రావు పేర్కొన్నారు.

